పేజీలు :12
వెల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham


సంపుటి : 01 సంచిక : 83 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) బుధవారం 24-6-2026 పేజీలు 12 వెల 5/-

## ఘనంగా పద్మ పురస్కారాల ప్రదానం

**ప్రముఖ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు, నటుడు మమ్ముట్టిలకు పద్మభూషణ్**

**తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారం**

**అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**



**న్యూఢిల్లీ, జూన్ 23మీడియా టుడే**
రెండో విడత పద్మ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పద్మ అవార్డులను అందజేశారు. 2026 సంవత్సరానికిగాను 131 మందికి పద్మ పురస్కారాలను కేంద్రం ప్రకటించగా, మే 25న తొలి విడతలో 66 మందికి పురస్కారాలను అందజేసిన సంగతి తెలిసిందే. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్రమోదీ, స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కింజారపు రామ్మోహన్‌నాయుడు తదితర ప్రముఖుల సమక్షంలో మంగళవారం రెండో విడత పద్మ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో భాగంగా.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేటీ థామస్, మలయాళ జర్నలిస్టు పీ నారాయణన్‌లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మ విభూషణ్ పురస్కారాలను ప్రదానం చేశారు. మలయాళ నటుడు మమ్ముట్టి, క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు, ప్లేబ్యాక్ సింగర్ ఆల్కా యాజ్ఞిక్‌తో పాటు మరో ముగ్గురు పద్మభూషణ్ అవార్డులను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ అందుకున్న వారిలో మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి గడ్డమణుగు, కుమారస్వామి తంగరాజ్, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యం, రామారెడ్డి మామిడి (మరణానంతరం) ఉన్నారు. రెండో విడతలో మొత్తం 65మందికి అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో ఇద్దరికి పద్మ విభూషణ్, ఆరుగురికి పద్మభూషణ్, 57 మందికి పద్మశ్రీ అవార్డులను అందజేశారు. తాజాగా పద్మశ్రీ అందుకున్నవారిలో నటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ ఉన్నారు.

# మెట్రో కొత్త మలుపు!

**2 దశలకు కలిపి ఒకే సంస్థ నుంచి రుణం.. సమకూర్చే బాధ్యతను కేంద్రం తీసుకుంటుంది**

**ఇప్పటికే ఓకే అయిన జపాన్ రుణం రద్దు**

**2 దశల మెట్రోల విలువలు మరోసారి మదింపు**

**ఎవాల్యుయేషన్ బాధ్యత ఎస్‌బీఐ క్యాప్స్‌కు**

**రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని గడువు**

**రెండు దశల్లో వాటాదారుగా ఉంటానన్న కేంద్రం**

**చర్చకు అంగీకరించిన ముఖ్యమంత్రి రేవంత్**

**అందుకోసమే మెట్రోపై మరోసారి మదింపు**

**వడ్డీ 4 శాతం దాటకుండాచూడాలని షరతు**

**ఖట్టర్, వైష్ణవ్, కిషన్‌రెడ్డిలతో రేవంత్ చర్చలు**

**జపాన్ అప్పు కోసం చెల్లించిన 84కోట్లు వెనక్కి**

**తాజా పరిణామాలపై ఎల్‌అండ్‌టీతో త్వరలో భేటీ**



**హైదరాబాద్, న్యూఢిల్లీ, జూన్ 23 మీడియా టుడే**
హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశకు రుణం మంజూరు, రెండో దశ విస్తరణకు సంబంధించిన వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఒక్కో దశకు విడివిడిగా కాకుండా రెండు దశలకు కలిపే రుణం మంజూరయ్యేలా చేసేందుకు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కార్యాచరణను రూపొందించాయి. ఈ మేరకు మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, రాష్ట్రానికే చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జరిపిన చర్చలు ఫలవంతం అయ్యాయి. కొత్త కార్యాచరణ ఖరారు కావడంతో మెట్రో మొదటి దశ స్వాధీనానికి ఎల్ అండ్ టీ కంపెనీకి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికిజపాన్ నుంచి భారత ప్రభుత్వరంగ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా మంజూరైన రూ.13,600 కోట్ల రుణం ప్రక్రియ నిలిచిపోనుంది. దానికి బదులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి ఆధ్వర్యంలో పాత మెట్రోను కొనడం, కొత్తగా విస్తరించడం చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి ప్రాజెక్టు కాబట్టి మొత్తం మెట్రో వ్యవహారాన్ని తాజాగా మొదలు పెడతారు. దీనికోసం ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెన్సీ సంస్థగా నియమించాలని .నిర్ణయించారు. మొదటి దశ ఆస్తుల విలువను నిర్ధారించడం, రెండో దశ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో తేల్చడం, ఆ రుణాలను తక్కువ వడ్డీకి ఇచ్చే సంస్థలను అన్వేషించి, అనుసంధానం చేయడం ఎస్‌బీఐ క్యాప్స్ బాధ్యత. ఇది రెండు నెలల్లో నివేదిక ఇస్తుంది. రెండు దశలకు అవసరమైన రుణం ఇచ్చే ఆర్థిక సంస్థలను ఎంపిక చేసి, వాటితో సంప్రదింపులు జరిపి, రెండు దశలకు కలిపి రుణం మంజూరుకు మార్గం సుగమం చేస్తుంది. రెండు దశలకు కలిపి రుణం తీసుకోవాలని భావిస్తున్న నేపథ్యంలోనే మరోసారి పాత మెట్రో ఆస్తులు, అప్పుల విలువను మదింపు చేయాలని నిర్ణయించారు. మెట్రో మొదటి, రెండో దశల్లో కూడా వాటాదారుగా ఉంటానని కేంద్రం చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాటా ఇచ్చేందుకు తమకేమీ అభ్యంతరం లేదని, ఆస్తులతో పాటు అప్పుల్లోనూ కేంద్రం బాధ్యత తీసుకోవాలని, ఈక్విటీ వాటాదారుగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ లెక్కల తర్వాత కేంద్రం వాటా ఎంత అనేది తేలనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణానికి సంబంధించిన వడ్డీ రేట్ల మీద పట్టుబట్టినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా జపాన్ నుంచి 4 శాతం వడ్డీకే రుణం వచ్చేట్లు మాట్లాడుకున్నామని, కొత్త రుణం కూడా ఇదే రేటుతో ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వానికి లాభదాయకంగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి కేంద్రమంత్రులు కూడా అంగీకరించినట్టు సమాచారం. హైదరాబాద్ మెట్రో రెండో దశను చేపట్టడానికి నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టీ సిద్ధంగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మెట్రోను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఫేజ్–1 స్వాధీనానికి రూ.13,600 కోట్లు అవసరం అయ్యింది. జపాన్ నుంచి ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా తీసుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

## గొడ్డలి పార్టీ కులం కుట్రలు కలిసికట్టుగా తిప్పికొట్టాలి

**సంబంధం లేని విషయాల్లోకి డిప్యూటీ సీఎంను లాగే యత్నాలు**

**పవన్‌పై బురదజల్లుతుంటే.. మంత్రులు నోరు మెదపరా?**

**దుష్ప్రచారాలను తిప్పికొట్టడమే కాదు.. ప్రజలకు వాస్తవాలు చెప్పాలి**

**క్రిమినల్స్‌కు గొడ్డలి పార్టీ దన్ను**

**ఏ చిన్న ఘటన దొరికినా వాడుకోవాలని ఆ పార్టీ చూస్తోంది**

**క్యాబినెట్‌లో చంద్రబాబు వ్యాఖ్యలు**



**అమరావతి, జూన్ 23: మీడియా టుడే**
కులాల మధ్య చిచ్చు రాజేసేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు పన్నుతోందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. వీటిని కలిసికట్టుగా తిప్పికొట్టాలని మంత్రివర్గ సహచరులకు సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎలాంటి సంబంధం లేని అంశాల్లోకి లాగి ఆయనకు కులాన్ని ఆపాదించాలని, బురదపులమాలని వైసీపీ ప్రయత్నిస్తోందని తప్పుబట్టారు. పవన్ కల్యాణ్‌ను అనవసర విషయాల్లోకి లాగి ఆయనపై బురదజల్లుతుంటే మంత్రులెవ్వరూ నోరుమెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి కుట్రలను కలిసికట్టుగా తిప్పికొట్టకపోతే కూటమికి అర్థమేముంటుందని నిలదీశారు. ప్రతి విషయంలోనూ పైనుంచి ఆదేశాలు వస్తాయని ఎదురుచూడకూడదని మంత్రివర్గ సహచరులకు హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. అజెండా అంశాలపై చర్చించిన తర్వాత సీఎం పలు అంశాలపై సహచరులకు దిశానిర్దేశం చేశారు. వైసీపీది తొలి నుంచి క్రిమినల్ మనస్తత్వమేనని, అందుకే నేరగాళ్లకు కొమ్ముకాస్తూ వస్తోందని అన్నారు. సమాజం హర్షించని అంశాలనే గొడ్డలి పార్టీ తలకెత్తుకుంటుందన్నారు. కర్నూలు ఘటనను ప్రస్తావించారు. ‘కర్నూలు జిల్లాలో గంగమ్మ అనే మహిళ తన సమీప బంధువుతో అక్రమ సంబంధం ఏర్పరచుకుని.. అతడి సాయంతో సొంత కుమారుడినే హతమార్చింది. ఆ తర్వాత తన కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించడం లేదంటూ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన సిట్ విచారణలో గంగమ్మే కొడుకును హతమార్చినట్లు తేలింది. ఆ తర్వాత అనారోగ్యంతో ఆస్పత్రిపాలైన గంగమ్మ అక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఊరిలోకి తీసుకొచ్చేందుకు గ్రామస్థులు అంగీకరించలేదు. ఈ కేసులో నిందితులకు వైసీపీ అండదండలున్నాయి. ఊరంతా వద్దన్న విషయాన్ని వైసీపీ నేతలు తలకెత్తుకున్నారు. ఇలాంటి క్రిమినల్ మనస్తత్వం ఆ పార్టీలోనే కనిపిస్తుంది’ అని చంద్రబాబు వివరించారు. కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ ఘటనలోనూ వైసీపీ అదే తరహాలో ప్రవర్తిస్తోందని, ప్రభుత్వ చిత్తశుద్ధిని సాయికృష్ణ తల్లి, బంధువులు నమ్ముతుంటే గొడ్డలి పార్టీ కుల రాజకీయం చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు చాలా వరకు అదుపులో ఉన్నాయని.. కానీ వైసీపీ ఏ చిన్న ఘటన దొరికినా దాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోవాలని చూస్తోందన్నారు. వైసీపీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సహచరులకు సూచించారు. ఆ పార్టీ దుష్ప్రచారాలపై విమర్శలు చేయడం కన్నా.. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడంపై దృష్టి పెట్టాలని కోరారు.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసే ఫైవ్‌స్టార్ హోటళ్లకు పన్ను రాయితీల అంశం చర్చకు వచ్చినప్పుడు మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ.. హోటళ్ల యాజమాన్యాలకు పన్ను రాయితీలు ఇవ్వడం కన్నా నేరుగా వినియోగదారులకు లబ్ధి చేకూరేలా రాయితీలు కల్పిస్తే బాగుంటుందని సూచించారు.

## కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ!

**పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు**

**ముందే ప్రధాని మోదీ క్యాబినెట్‌లో భారీ మార్పులు?**

**ద్రౌపది ముర్ముతో ప్రధాని భేటీ**

**కేంద్ర సహాయ మంత్రి కురియన్ రాజీనామా**

**21న ముగిసిన కురియన్ రాజ్యసభ పదవీకాలం**

**మరో మంత్రి రవనీత్‌సింగ్‌కూ దక్కని రెన్యువల్**

**రాష్ట్రాల బీజేపీ చీఫ్‌లుగా మరో ఇద్దరు మంత్రులు**

**దీంతో తెరపైకి పునర్వ్యవస్థీకరణ ఊహాగానాలు**

**33శాతం మహిళలకు చోటు దక్కే అవకాశం?**



**న్యూఢిల్లీ, జూన్ 23 మీడియా టుడే**
కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై దేశ రాజధానిలో మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే ప్రధాని నరేంద్రమోదీ క్యాబినెట్‌లో భారీ మార్పులు జరుగుతాయని ప్రచారం జరుగుతోంది. మంగళవారం సాయంత్రం ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని కీలక సమాలోచనలు జరిపారు. మరోవైపు ఇద్దరు కేంద్రమంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినా.. వారిని తిరిగి ఎంపిక చేయలేదు. వీరిలో ఒకరు బుధవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాలన్నీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలకు ఆస్కారమిచ్చాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20న ప్రారంభమవుతాయని, అంతకుముందే మంత్రివర్గంలో కీలక మార్పులు జరుగుతాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బుధవారం జరిగే కేంద్ర క్యాబినెట్ భేటీలో పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా, కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈ నెల 21నే ముగియగా.. ఆమెను కూడా రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు. ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఈసారి కేంద్ర మంత్రివర్గంలో 33 శాతం మహిళలకు తప్పక అవకాశం లభిస్తుందనే చర్చ మొదలైంది. దీంతో పలు రాష్ట్రాలకు చెందిన మహిళా ఎంపీలు ఇప్పటికే ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

## 3 రోజుల్లో 600 బిలియన్ డాలర్లకు పైగా..స్పేస్ ఎక్స్ షేర్లు పతనం!

**అదానీ, అంబానీల సంపదకు దాదాపు మూడింతల విలువ!**



**న్యూఢిల్లీ, జూన్ 23: మీడియా టుడే**
ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించి రోజులైనా గడవకుండానే ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ షేర్లు భారీగా పతనం అయ్యాయి. కేవలం మూడు ట్రేడింగ్ సెషన్లలోనే 600 బిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ విలువను కోల్పోయాయి. ఇది భారత్‌లోని ఇద్దరు సంపన్న వ్యాపారవేత్తలు ముకేశ్ అంబానీ(88.3 బిలియన్ డాలర్లు), గౌతమ్ అదానీ(120 బిలియన్ డాలర్లు)ల సంపదకు దాదాపు మూడు రెట్లు. స్పేస్ ఎక్స్ షేరు విలువ సోమవారం ఒక్క రోజే 16శాతం పతనమై 154.60 డాలర్ల వద్ద ముగిసింది. దీంతో నాస్‌డాక్‌లో లిస్టయిన తర్వాత తొలిసారిగా 2 ట్రిలియన్ డాలర్ల దిగువకు స్పేస్ ఎక్స్ మార్కెట్ విలువ తగ్గిపోయింది. ఐపీవోకు వచ్చి 75 బిలియన్ డాలర్ల సేకరణతో రికార్డులు బద్దలు కొట్టిన కొద్ది రోజులకే ఈ పతనం చోటు చేసుకుంది. తొలుత ఇన్వెస్టర్లు ఇందులో పెట్టుబడి పెట్టేందుకు పోటీ పడడంతో ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా అవతరించింది. అయితే తర్వాత సెల్లర్లు లాభాల స్వీకరణకు దిగారని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా స్పేస్ ఎక్స్ షేర్ల పతనంతో దాని సీఈవో ఎలాన్ మస్క్ ఆస్తుల నికర విలువ కూడా బాగా తగ్గిపోయింది. ఈ సంస్థలో 38శాతం వాటా కలిగి ఉన్న ఆయన ఆస్తుల విలువ సుమారు 350 బిలియన్ డాలర్లు తగ్గిపోయినట్లు అంచనా. ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది.

# రైతులు సంక్షేమమే సర్కార్ ధ్యేయం

**సన్న రకాలు సాగు చేయండి**

**విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్..**



**జగిత్యాల మీడియా టుడే -జూన్ 23**
రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ (శ్రీరాముల పల్లి ) రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు.ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు.గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం గా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715 తదితర నాణ్యమైన వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంట నాణ్యత పెరిగి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన య్యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేది నుంచి 31వ తేది వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు..

# మైనర్ బాలిక పై లైంగిక దాడి, హత్యాయత్నం చేసిన గౌస్ ను ఉరి తీయాలి

**-బాధిత కుటుంబాని కి కోటి రూపాయలు ఎక్స్ గ్రేసీయా ఇవ్వాలి.**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
మైనర్ బాలిక పై లైంగిక దాడి, హత్యాయత్నం చేసిన గౌస్ పాషా ను తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి ఉరి తీయాలనీ కోరుతూ, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని. ప్రభుత్వ పథకాలు అందజేయాలనీ కోరుతూ రజక సంఘాలు, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బురహాన్ పురం జెండాల సెంటర్ నుండి పెవిలియన్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్ జక్కుల లక్ష్మయ్య, మాజీ కార్పొరేటర్లు బుడిగం శ్రీనివాసరావు, బుర్రి వెంకట్, నాయకులు ఆకుల గాంధీ, బహుజన సంఘాల జిల్లా నాయకులు కత్తి నెహ్రూ గౌడ్, బోడా వీరన్న, మాజీ కౌన్సిలర్ పువ్వాడ పార్థసారధి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నాగేందర్, ఉద్యమ కారుల సంఘం నాయకులు డాక్టర్ కె వి. కృష్ణారావు,లింగనబోయిన సతీష్, రేగళ్ల సీతారాములు, గుండ్లపల్లి శేషు, గోరంట్ల రవి, బానోత్ భద్రు నాయక్, జక్కుల వెంకటరమణ, రేగళ్ల కొండలు, బాసాటి హనుమంతరావు, రేగముడి రామకృష్ణ, కంద్రాతి వెంకన్న, దాసరి మధు లు మాట్లాడుతూ గౌస్ ను వెంకనే ఉరి తీయాలనీ, బాధిత కుటంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసారు. ఈ ర్యాలీ లో గౌస్ పాషా కి ఉరిశిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వాలని, కార్పొరేట్ వైద్యం అందించాలని ఎత్తున నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో




నాయకులు నాయకులు మన్నే వెంకటరమణ, 50వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరెడ్డి రమేష్, పేరెల్లి విజయ్ కుమార్, గొట్టేపర్తి శ్రీనివాస్,మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, రజక సంఘం నాయకులు రేగళ్ల కొండలు, తెనాలి వీరబాబు,గోలి రామారావు, గోనేల శివ, బోనగిరి ఉపేందర్, పగిల్ల బుచ్చిబాబు,గోనెల రవిశంకర్, పిల్లుట్ల కృష్ణ, జక్కుల శ్రీనివాస్, కొలిపాక వెంకట్,వట్టేకోటి అప్పారావు, వట్టేకోటి వెంకన్న, జక్కుల పద్మ, జక్కుల మౌనిక, మాధురి, శిరీష, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్న గీతం ఆంగ్ల విభాగం

**ఆంగ్లంలో బీఏ, ఎంఏ కోర్సులలో చేరడానికి ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలి**



**పటాన్ చెరు ప్రతినిధి,
మీడియా టుడే, జూన్ 23 :**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో గల ఆంగ్ల, ఇతర భాషల విభాగం, ఆంగ్లంలో అందించే యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. తమ విభాగం ద్వారా భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్నట్టు ఆయన వెల్లడించారు. స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీ.ఎస్.హెచ్.ఎస్)లో భాగంగా ఉన్న ఈ విభాగం, మేధోపరమైన పటిమ, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాన్ని మేళవించి ఒక ఉత్సాహభరితమైన విద్యా వాతావరణాన్ని అందిస్తోందన్నారు. ఆంగ్ల విభాగంలో ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి విస్తృతమైన బోధన, పరిశోధనా అనుభవం కలిగిన విశిష్ట అధ్యాపకుల బృందం ఉన్నట్టు డాక్టర్ సయంతన్ తెలియజేశారు. వారి నైపుణ్య రంగాలలో ఆంగ్లంలో భారతీయ రచన, ముద్రణ సంస్కృతి, అనువాద అధ్యయనాలు, వలస సాహిత్యం, డిజిటల్ హ్యుమానిటీస్, లింగ, లైంగికత అధ్యయనాలు, అట్టడుగు వర్గాలు, సాహిత్యం, సామాజిక భాషా శాస్త్రం, ఆంగ్ల భాషా విద్య, శైలిశాస్త్రం, ధ్వనిశాస్త్రం వంటివి ఉన్నాయన్నారు. అమెరికన్ సాహిత్యం, బ్రిటిష్ సాహిత్యం, ఆంగ్లంలో భారతీయ రచనలలో బలమైన పునాదిని విద్యార్థులు పొందుతారని డాక్టర్ మోండల్ తెలిపారు. అదే సమయంలో, డిజిటల్ హ్యుమానిటీస్, తులనాత్మక సాహిత్యం, సాంస్కృతిక అధ్యయనాలు, అనువర్తిత భాషాశాస్త్రం, ఆంగ్ల భాషా విద్య వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలను కూడా విద్యార్థులు అన్వేషిస్తారని ఆయన వివరించారు. విద్యానుభవాన్ని సుసంపన్నం చేయడానికి, ఈ విభాగం ప్రఖ్యాత పండితులు, నిపుణులతో కార్యశాలలు, సమావేశాలు, నిపుణుల ఉపన్యాసాలు, జ్ఞాన-భాగస్వామ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోందన్నారు. ఆంగ్ల విభాగం నుంచి పట్టభద్రులైన వారు విద్య, పరిశోధనా రంగం, సృజనాత్మక రచన, అనువాదం, మీడియా, జర్నలిజం, కంటెంట్, సాంకేతిక రచన, ప్రచురణ, కాపీ ఎడిటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్, విధాన పరిశోధన సంస్థలలో విభిన్న వృత్తి అవకాశాలను చేపట్టడానికి సన్నద్ధులై ఉంటారన్న ధీమాను ఆయన వ్యక్తపరిచారు. డీన్ ప్రొఫెసర్ రథిన్ రాయ్, డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, విభాగాధిపతిగా తన నాయత్వంలో ఆంగ్ల, ఇతర భాషల విభాగం పనిచేస్తోందని తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అత్యుత్తమ విద్యార్థులకు మెరిట్ ఆధారిత స్కాలర్ షిప్పులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాల కోసం గీతం వెబ్ సైట్ ఞఞఞ.స్త్రఱ్ఱుఎ.వసబ ను సందర్శించాలని, లేదా 87120 18815 / 88849 84000లను సంప్రదించాలని ఆయన సూచించారు.

# రామచంద్రపురంలో ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

**పాల్గొన్న ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి**

**రామచంద్రాపురం ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 23 :**
దేశ సమగ్రత, అఖండత కోసం ప్రాణాలర్పించిన అపర దేశభక్తుడు, మహనీయుడు డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు.. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండటానికి వీల్లేదని (ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే) కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం నాడే గళమెత్తి, చివరి శ్వాస వరకు పోరాడిన వీరుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం వృధా పోలేదని, ఆయన కన్న కలలను నేడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు ద్వారా సాకారం చేసిందని గుర్తుచేశారు. ముఖర్జీ ఆశయ సాధన, నిరుపమాన దేశభక్తి నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని, దేశ రక్షణ, అఖండత కోసం ఆయన చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు.



?బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రయోజనాలే పరమావధిగా జీవించిన మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ దేశ బలోపేతానికి కార్యకర్తలంతా పునరంకితం కావాలని కోరారు.

# డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

**-దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు**

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 23 :**
దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్?పాల్ సూర్యనారాయణ అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జాతి ఐక్యత కోసంఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం ఒక దేశం, ఒక చట్టం, ఒక రాజ్యాంగం అని నినదించిన మహనీయుడని కొనియాడారు. కేవలం రాజకీయనేతనే కాకుండా విద్యావేత్తగా, దార్శనికుడిగా జాతీయ సమగ్రత కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత కాశ్మీర్?కు ప్రత్యేక జెండా ప్రత్యేక రాజ్యాంగం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీంతో 1953లో ఒక దేశంలో రెండు చట్టాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని కాశ్మీర్?లోకి అడుగుపెట్టారన్నారు. అప్పుడే ఆయన అనుమానాస్పదంగా మరణించారన్నారు. అప్పటినుంచి జూన్ 23ను బలిదాన్ దివస్ గ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి యువత దేశం కోసం చదవాలని, దేశం కోసం బతకాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బెల్లాల్ శశాంక్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బొబ్బిలి సువర్ణ వేణు, కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, ప్రసన్న సత్యపాల్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఆనంద్ రావు, భూపతి, బాబీ సింగ్, సీనియర్ నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : డాక్టర్ పావని.

**మణుగూరు,జూన్ 23( మీడియా టుడే):**



జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి, 0--5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ పావని సూచించారు.ఈ సందర్భంగా మణుగూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై బూత్ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, బూత్‌ల నిర్వహణ, సిబ్బంది నియామకం, వ్యాక్సిన్ నిల్వ, రవాణా, ట్రాన్సిట్ బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సందర్శన కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.ప్రత్యేకించి వలస కార్మికుల పిల్లలు, మారుమూల ప్రాంతాల్లోని చిన్నారులు, బూత్‌లకు రాని పిల్లలను గుర్తించి వారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. పోలియో రహిత భారతదేశ లక్ష్యాన్ని కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, బూత్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివి

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



జగతిలో విద్యను మించిన సంపదలేదని, అట్టి విద్యారంగంలో పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హెచ్. శైలేంద్ర అన్నారు.మల్లన్నపాలెం పాఠశాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఇరవై కుర్చీలు సమకూర్చిన సందర్భముగాఏర్పాటైన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలేంద్రముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిశపుల్లయ్య కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు సమాజం సహకరించాలని పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య కోరారు.ఈ సందర్భముగా పూర్వప్రాథమిక విద్యలో చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.కార్యక్రమం లో సర్పంచ్ కోలేటి వెంకటేశ్వర్లు, మాజీసర్పంచ్ చిలకల రామకృష్ణ, పాఠశాలకమిటీ ఛైర్మన్ కోనంగి నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు ఉషశ్రీ, లలిత, నరసింహారావు, సంస్కృతి, పమ్మిఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చింతలప్రసాద్, పమ్మి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# " రైతు ఆశీర్వాద" సభను జయప్రదం చేయండి

**-డిసిసి అధ్యక్షతన సన్నాహక సమావేశం**


**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



ఈనెల ది 30-06-2026 న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ ది 23-06-2026 న జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ సన్నాహకసమావేశంనిర్వహించనైనది.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేయుచున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు, అదే విధంగా మధిర నియోజకవర్గం చింతకాని మండలం నుండి 9000 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారని, మన ఖమ్మం జిల్లా నుండి నిధులు విడుదల చేయటం మన జిల్లా రైతాంగానికి గర్వకారణం అని రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఖమ్మం జిల్లా రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమమును జయప్రదం చేయగలరని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు. అదే విధంగా జన సమీకరణకు నియోజకవర్గాల వారీగా,మండలాల వారీగా ఇంచార్జీలను నియమిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్,పుచ్చకాయల వీరభద్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్,మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 23 :**



ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంట్లో ఏసీబీ సోదాలు కలకలం సృష్టించాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఆయనపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఆయన నివాసంలో ఉదయం నుంచే సోదాలు జరిగాయి నగరంలోని ఆయన నివాసం ప్రగతినగర్లోని సూపరింటెండెంట్ మల్లారెడ్డిలో ఇంట్లో ఏసీబీ అధికారులు ఉదయం నుంచే సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలపై ఆయన ఇంట్లో తనిఖీలు చేశారు. అలాగే రాష్ట్రావ్యాప్తంగా ఆయనకు సంబంధించిన వారి ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నట్లుగా సమాచారం. ఈ సందర్భంగా కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు మల్లారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం తరలించినట్లు తెలుస్తోంది. తనిఖీల అనంతరం ఏసీబీ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉందని తెలిపారు.

# ఇక్రిసాట్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**

**కాలనీ వాసులతో సమావేశం.. క్షేత్రస్థాయిలో పర్యటన..**

**అమీన్ పూర్ ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 23 :**



బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫేజ్ 1 కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అంతర్గత సిసి రోడ్లు, నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే .. కాలనీ పరిధిలో నూతనంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ పైప్లైన్, మంచినీటి పైపుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ అంశాన్ని సైతం పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డిఇ వెంకట రమణ, డిజిఎం శివ కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళ్తున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తికి ఘన సన్మానం

మహబూబ్నగర్ మీడియా టుడే ప్రతినిధి



జిల్లా కోర్టు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తిగా నిన్నటి వరకు పనిచేసిన కళ్యాణ్ చక్రవర్తి జోగులంబ గద్వాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందుతూ బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం మహబూబ్నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి కి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత మాట్లాడుతూ మహబూబ్నగర్ భార్ అసోసియేషన్ కు మంచి పేరు ఉందని ఇక్కడ పని చేయాలంటే ఒక అదృష్టంగా భావించాలని అన్నారు. మొదటి ఆదనపు కోర్ట్ న్యాయమూర్తి కి ఇంత అభిమానం, ఆదరణ, లభించడం అనేది చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. అనంతరం బార్ సోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ రావు మాట్లాడుతూ మొదటి అదనపు జడ్జి సేవలు మరువలేనివని ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని తెలిపారు. , మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ మహబూబ్నగర్ కోర్టు లో పనిచేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఇక్కడి నుంచి వెళ్లడం చాలా బాధవేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు, సీనియర్ ,జూనియర్ జడ్జి లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి డబ్బుల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు పెబ్బేటి వెంకటయ్య , బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చంద్రమౌళి, అనంతరెడ్డి ,అనిల్ కుమార్, న్యాయవాది సొసైటీ ప్రసిడెంట్ రోహిణి అయ్యంగార్,సొసైటీ ప్రధాన కార్యదర్శి కాంతరెడ్డి,సీనియర్ న్యాయవాదులు ఎన్ పి వెంకటేష్,స్వదేశ్ , వై. రవికుమార్ యాదవ్, గడ్డం గోపాల్ ,జ. రాజేందర్ కుమార్, శర్మ,మల్లారెడ్డి,బార్ సోసియేషన్ కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా కళాశాలలో మాదక ద్రవ్యాల పై అవగాహన సదస్సు

మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 23 :



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆర్మూర్ నందు మంగళవారం ఆర్మూర్ పోలీస్ శాఖ వారు కళాశాలలోని ఎన్.ఎస్.ఎస్ విభాగం వారితో సంయుక్తంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అమ్మాయిల పై గల వేధింపుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. విద్యార్థులతో సంబంధిత ప్రతిజ్ఞ ను చేయించారు. యువత ముఖ్యంగా స్పందించాలని ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్ మాట్లాడారు. విద్యార్థులకు ఉపయోగకర కార్యక్రమం ఏర్పరిచినందుకు ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ గా ఉన్న అధ్యాపకురాలు ఎం. శిరీషను, సంబంధిత విభాగాన్ని కొనియాడుతూ, పోలీస్ శాఖ వారికి కృతజ్ఞతలు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. చంద్రిక తెలియజేశారు. ఇలాంటి అవగాహన సదస్సులు విద్యార్థులకు ఉపయోగకరమన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగ నిర్మూలనగా అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీసర్పంచ్ లసంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా రాయపూడి రామారావు,దుద్దేల పవన్ ఎన్నిక

నేలకొండపల్లి 23 మీడియా టుడే ప్రతినిధి



నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సంఘం ఎన్నిక మంగళవారంనేలకొండపల్లిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగింది. ముందుగా మండల కాంగ్రెస్ పార్టీసర్పంచ్ ల సంఘం సమావేశంనిర్వహించారు .ఈసందర్భంగా మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడుగా రాజారాంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ రాయపూడి రామారావు,ప్రధాన కార్యదర్శిగా రామచంద్రపురం గ్రామపంచాయతీ సర్పంచ్ దుద్దేల పవన్ నుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈసందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామారావు మాట్లాడుతూనా మీద నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సర్పంచ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల సమస్యల విషయంలో రాజీలేని పోరాటం చేస్తానని ఆయన చెప్పారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననిచెప్పారు. ఈకార్యక్రమంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు,నేలకొండపల్లి ఏఎంసీచైర్మన్.సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్,నాయకులు నెల్లూరి భద్రయ్య,బొడ్డు బొందయ్య మామిడి వెంకన్న,నంబూరి రామారావు,గుడిబోయిన వెంకటేశ్వర్లు సర్పంచ్ లు,మాజీ సర్పంచ్ లు,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

**విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి**



నిజామాబాదు జూన్23 (మీడియా టుడే ప్రతినిధి):

నీట్ పేపర్ లీక్ పై ఆందోళన చేసిన రాహుల్ గాంధీ కి మద్దతుగా ఛత్రోస్ కి గుంజ్ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ద్వారా దేశ యువత భవిష్యత్తు దెబ్బతిందని, ఇది కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే అని అన్నారు.నీట్ ఇక పరీక్ష కాదు వేలంల మారింది అని అన్న రాహుల్ గాంధీ కి మద్దతుగా జిల్లాలో ఆందోళన చేయడం జరిగిందన్నారు.విద్యార్థులు కష్టపడి చదివిన దానికి న్యాయం జరగాలని, వ్యవస్థలు బాధ్యతలో వ్యవహారించాలని అన్నారు. ఢిల్లీ రాజధానిలో ఎంతో మంది విద్యార్థులు నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తున్నారని, యువకులు డిమాండ్ చేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి నైతిక భాద్యతతో రాజీనామా చేయాలన్నారు. దేశానికి భవిష్యత్తు యువకుల వల్లనే అని రాహుల్ గాంధీ గారి యువకులు ప్రాధాన్యత ఇస్తున్నారని, వారికి ఏలాంటి కష్టం వచ్చిన ముందుండి పోరాటం చేస్తున్నారన్నరు. యువకులకు న్యాయం జరిగే విధంగా రాహుల్ గాంధీ ఆందోళన ఉదృతం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నవీపేట్ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ నితిన్,కిష్టా గౌడ్,జావీద్, రాములు, సాయిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా

## నివాళులు అర్పించిన బీజేపీ తెలంగాణ అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు



బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 23:

జ్వలంత జాతీయవాద చింతకుడు, గొప్ప విద్యావేత్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మన మార్గదర్శకులు పూజ్య డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా, నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు.ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ "ఒక దేశం, ఒక జెండా, ఒక రాజ్యాంగం" అనే దృఢ సంకల్పంతో, మాతృభూమి భారతదేశ ఐక్యత మరియు సమగ్రత కోసం డా. ముఖర్జీ గారు తన ప్రాణాలను అర్పించారు అని అన్నారు. ఆయన జీవిత త్యాగం, ధైర్యం, తపస్సు మరియు అచంచల దేశభక్తి చిరస్మరణీయ గాథగా నిలిచింది.జాతీయ ఐక్యత, సాంస్కృతిక వైభవం మరియు దేశ సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి భారతీయుడికి నిరంతరం స్ఫూర్తినిస్తుంది అని అన్నారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లక్ష్యం వైపు మనం ముందుకు సాగుతున్న ఈ ప్రయాణంలో, ఆయన ఆదర్శాలు ప్రతి అడుగులోనూ మనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అని అన్నారు.భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే త్యాగం, పోరాటం చేసిన ఈ మహనీయ జాతీయ నాయకుడికి పునఃపునః వందనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు శ్రీ సీహెచ్. విద్యాసాగర్ రావు గారు, శ్రీ బండారు దత్తాత్రేయ గారు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం

**-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**-ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.**

**-వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం.. వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు.**

**-నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి.**

**వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.**



మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :

ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టీఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువత దేశం కోసం చదవాలని, దేశం కోసం బ్రతకాలని డాక్టర్ శ్యామా ప్రసాద్ స్ఫూర్తి

**దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...**



నిజామాబాదు జూన్23 (మీడియా టుడే ప్రతినిధి):

దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతి ఐక్యత కోసం ఒక దేశం, ఒక చట్టం, ఒక రాజ్యాంగం అని నినదించిన మహనీయుడు అని కొనియాడారు. కేవలం రాజకీయనేతనే కాకుండా విద్యావేత్తగా, దార్శనికుడిగా జాతీయ సమగ్రత కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. స్వాతంత్రం తర్వాత కాశ్మీర్ కు ప్రత్యేక జెండా ప్రత్యేక రాజ్యాంగం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీంతో 1953లో "ఒక దేశంలో రెండు చట్టాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని కాశ్మీర్ లోకి అడుగుపెట్టారన్నారు. అప్పుడే అనుమానాస్పదంగా మరణించి దేశం కోసం నిలిచారన్నారు. అప్పటినుంచి జూన్ 23ను బలిదాన్ దివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి యువత దేశం కోసం చదవాలని, దేశం కోసం బ్రతకాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బెల్లాల్ శశాంక్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బొబ్బిలి సువర్ణ వేణు, కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, ప్రసన్న సత్యపాల్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఆనంద్ రావు, భూపతి, బాబీ సింగ్, సీనియర్ నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**రైతుల గొంతు నొక్కుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**మమ్మల్ని అరెస్ట్ చేసి గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి రైతులకు యూరియా అందించు రేవంత్ రెడ్డి**

**యూరియా యాప్ సమస్యలపై నిరసనలకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులు చేయడం దుర్మార్గం**

**కామారెడ్డి జిల్లాలో 300 మందికి పైగా బీఆర్ఎస్ శ్రేణుల అక్రమ అరెస్ట్**

**రేవంత్ రెడ్డి కి భూములపై ఉన్న ప్రేమ రైతుల బాధలపై లేదు**

**రేవంత్ రెడ్డి ది ప్రజాపాలన కాదు.. నియంతృత్వ నిరంకుశ, నిర్భంద పాలన**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



నిజామాబాదు జూన్23 (మీడియా టుడే ప్రతినిధి):

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండలంలో రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే ఈ రోజే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని హితవు పలికారు. "మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు.రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు.రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలి" అని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి, వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో, బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు."ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు" అని హెచ్చరించారు.ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు.ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మీడియా టుడే

బుధవారం, జూన్ 24, 2026

# మణుగూరుకు డిప్‌సైడ్ బ్లాక్, ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులే జీవనాడి

- "సేవ్ మణుగూరు"నినాదం కాదు...అవసరం.- - 244.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు..
- 40 ఏళ్ల ఉపాధికి భరోసా.- - ఏఐటీయూసీ ఉద్యమ బాటలో.. ఇతర కార్మిక సంఘాల వైఖరి ఏమిటి..?
- ఏరియాను సందర్శించిన సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్.వి. సత్యనారాయణ.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 22(మీడియా టుడే):** మణుగూరు ప్రాంత భవిష్యత్తు, వేలాది మంది కార్మికుల ఉపాధి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు జీవనాధారంగా నిలిచిన సింగరేణి ప్రాజెక్టుల కొనసాగింపుపై ఇప్పుడు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలన్న డిమాండ్, మణుగూరు ఓసీపీ ఎక్స్‌టెన్షన్‌కు అనుమతులు మంజూరు చేయాలన్న ఉద్యమం క్రమంగా ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్నప్పటికీ, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఇతర కార్మిక సంఘాలు ఇప్పటివరకు స్పష్టమైన వైఖరిని ప్రకటించకపోవడం చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికే పీకేఓసీ డీప్‌సైడ్ ప్రాజెక్టులో 244.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, 40 సంవత్సరాల జీవితకాలం, 6.25 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి పెంపు ప్రతిపాదనలు ఉండగా, మణుగూరు ఓసీ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు కూడా భవిష్యత్ ఉత్పత్తి, ఉపాధి అవకాశాల దృష్ట్యా కీలకంగా మారింది. ఈ రెండు ప్రాజెక్టులు మణుగూరు ప్రాంత ఆర్థిక, సామాజిక వ్యవస్థకు జీవనాడిగా నిలుస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.మౌనంగా అధికార పార్టీ....పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులకు అనుమతులు వేగవంతం చేయాలని వివిధ వర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ అధికార పార్టీ నాయకత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం కార్మిక వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ పెద్దలు ఈ అంశాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.డైరెక్టర్ దృష్టిలో డిప్‌సైడ్, ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులు...మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్.వి. సత్యనారాయణ కేకేచ్‌పీ, పీకేఓసీ–2 గనులను సందర్శించి ఉత్పత్తి, రవాణా వ్యవస్థలపై సమీక్ష నిర్వహించారు. పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్ వేలం ప్రక్రియ, మణుగూరు ఓసీ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు, భవిష్యత్ ఉత్పత్తి అవసరాలపై అధికారులు ఆయనకు వివరించారు. మణుగూరు ప్రాంతంలో మరో 15–20 సంవత్సరాల పాటు ఉత్పత్తి కొనసాగాలంటే ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులు అత్యంత కీలకమని అధికారులు వివరించగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి వ్యవస్థలను బలోపేతం చేయాలని డైరెక్టర్ సూచించినట్లు తెలిసింది.ఇతర యూనియన్లు ఏ వైఖరి అవలంబిస్తాయి..?ఏఐటీయూసీ ఇప్పటికే "సేవ్ మణుగూరు" నినాదంతో ఉద్యమ బాట పట్టగా, మిగతా కార్మిక సంఘాలు కూడా ఈ అంశంపై తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. ఉత్పత్తి, రవాణా, సంక్షేమ అంశాలపై మాత్రమే కాకుండా భవిష్యత్ తరాల ఉపాధి, కొత్త ప్రాజెక్టుల సాధన, ప్రాంత మనుగడ వంటి అంశాలపై కూడా అన్ని యూనియన్లు ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.ఇది ఒక్క సంఘం పోరాటం కాదు.. ప్రాంత భవిష్యత్తు కోసం ఉద్యమం..మణుగూరు మనుగడకు సంబంధించిన ఈ అంశం కేవలం కార్మిక సంఘాల సమస్య మాత్రమే కాదని, వేలాది కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.మరో ఇల్లందు.. మరో కొత్తగూడెం కాకూడదంటే..!గతంలో గనుల ఉత్పత్తి తగ్గడం, కొత్త ప్రాజెక్టులు లేకపోవడం వల్ల ఇల్లందు, కొత్తగూడెం ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులను మణుగూరు ఎదుర్కోకూడదంటే ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు గుర్తుచేస్తున్నారు. బొగ్గు ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం సింగరేణి కార్మికులపైనే కాకుండా వ్యాపారులు, రవాణా రంగం, చిన్న చిన్న ఉపాధి రంగాలు, విద్యాసంస్థలు, వైద్య రంగం సహా మొత్తం ప్రాంత ఆర్థిక వ్యవస్థపై పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.'మన బొగ్గు మనకే' అనే నినాదం బలపడుతోంది..మణుగూరు ఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, ఇతర సంస్థలకు అప్పగించరాదనే డిమాండ్ బలపడుతోంది. 135 సంవత్సరాల అనుభవం కలిగిన సింగరేణి సంస్థ చేతుల్లోనే ఈ బొగ్గు సంపద ఉంటే స్థానికులకు ఉపాధి, ప్రాంతానికి అభివృద్ధి, రాష్ట్రానికి ఆదాయం లభిస్తుందని కార్మిక వర్గాలు, ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.సేవ్ మణుగూరు సాధ్యమవ్వాలంటే..?– పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరగాలి.– మణుగూరు ఓసీపీ ఎక్స్‌టెన్షన్‌కు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులను వేగవంతం చేయాలి. అన్ని కార్మిక సంఘాలు ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు ఢిల్లీ స్థాయిలో ప్రత్యేక చొరవ తీసుకోవాలి. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభావిత గ్రామాల పునరావాసం, పర్యావరణ పరిరక్షణపై స్పష్టమైన విధానాలు అమలు చేయాలి. ప్రజా సంఘాలు, వ్యాపారవేత్తలు, మేధావులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలి.మణుగూరు కోసం ఎవరు ముందుకొస్తారు..?మణుగూరు భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తమవుతున్న ఈ సమయంలో రాజకీయ భేదాలు, సంఘాల మధ్య విభేదాలు పక్కనబెట్టి అందరూ ఒకే వేదికపైకి వస్తారా..? అధికార పార్టీ నాయకత్వం స్పందిస్తుందా..? ఇతర కార్మిక సంఘాలు ఉద్యమంలో భాగమవుతాయా..? ప్రజా సంఘాలు, వ్యాపార వర్గాలు తమ గళాన్ని వినిపిస్తాయా..? అనే ప్రశ్నలకు సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది.ఎందుకంటే.. .సింగరేణి ఉంటేనే మణుగూరు ఉంటుంది..మణుగూరు ఉంటేనే వేల కుటుంబాల భవిష్యత్తు ఉంటుంది..అందుకే "సేవ్ మణుగూరు" ఇప్పుడు ఒక నినాదం కాదు... కాలానుగుణ అవసరం.

# పిల్లల చదువు వ్యాపారం కాకూడదు, పారదర్శకత ఉండాలి

**తల్లి తండ్రులపై అదనపు ఆర్థిక భారమే**

**ఈ అంశంపై విచారణ జరగాలి అని బాలల హక్కుల సంఘం డిమాండ్**

**అనురాధ రావు అధ్యక్షులు - బాలల హక్కుల సంఘం**




**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 23:** పిల్లల చదువు పేరుతో తల్లితండ్రుల జేబు ఖాళీ చేస్తున్నాయి విద్యాసంస్థలు. బత్తిడి చేసి బయట 20 రూ॥ దొరికే నోటు పుస్తకం – 40రూ॥లకు అమ్ముతున్నారు వీళ్లు. ఇది చాలా తీవ్రమైన విషయం.ఇటీవల సోషల్ మిడియాలో కొన్ని విడియోలు వైరలు అవుతున్నాయి, ప్రైవేటు స్కూల్స్, కాలేజేలకి సంబంధించినవి. వీటిలో భారిగా స్టేషనరీ నిలవలు, యూనిఫాం, బ్యాగులు, సాక్స్ కనిపిస్తున్నాయి. ఈ సంస్థలు అన్నీ కూడా బాగా పేరు పొందినవే. (Narayana school kothapet, Sloka International school, Sri Triveni school, Pulla Reddy Memorial school, Dilshuknagar Public school, Srichaitanya) etc...ఒకవేళ పేరెంట్ బయట కొంటే ప్రధానోపద్యాయులే పేరెంట్స్ పై తిరగబడిన సంఘటనలు కూడా చూస్తున్నం.మీరు ఇక్కడే కొనాలి అని, అన్నింటిపై వీరి సంస్థ బ్రాండ్ ప్రింట్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇది తల్లి తండ్రులపై అదనపు ఆర్థిక భారమే కదా.విద్యారంగం సేవారంగంలో ఉండాలి, కాని పూర్తి వ్యాపర రంగంగా మార్చేశారు.అధికారుల కళ్ళు మూతలు పడ్డాయా? వీళ్ల దృష్టిలో లేదు అని అనుకోవడం తప్పు, సోషల్ మీడియా లో వైరల్ అవుతుంటే ఏ ఒక్క అధికారికి తెలియదు అని అనుకోకుండా ఉండలేం.పూర్తిగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అమ్ముడు పోయినట్లు తెలుస్తోంది .ఈ వైరల్ విడియోల ఆరోపణలపై తెలంగాణ విద్యాశాఖ మంత్రి, మన ముఖ్యమంత్రి గారు, అధికారాలు స్పందించాలని, వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూన్నది బాలల హక్కుల సంఘం.రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి.బలవంతపు స్టేషనరీ అమ్మకాలు జరుగుతున్న విషయంపై విచారణ చేయాలి.మార్కెట్ ధరలకంటే అధిక ధరలతో విక్రయిస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలి.తల్లి తండ్రులు ఎంపిక చేసుకునే హక్కును రక్షించాలి.పిల్లల చదువు వ్యాపారం కాకూడదు, పారదర్శకత ఉండాలి. ఈ అంశంపై విచారణ జరగాలి అని బాలల హక్కుల సంఘం డిమాండ్.

# విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించాలనేదే సంకల్పం

**ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి - కలెక్టర్ తో కలిసి నవీపేటలో స్థల పరిశీలన**



**నిజామాబాదు జూన్23 (మీడియా టుడే ప్రతినిధి):** విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు, అధునాతన సౌకర్యాలతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట ఒకటవ తరగతి నుండి 12 తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు ప్రశ్నలు వేస్తూ, విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు, బహుమతులు అందించి ప్రోత్సహించారు. వీరి వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# రైతులకు 7 రకాల విత్తనాల సంచులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**జనగామ జిల్లాపాలకుర్తి నియోజకవర్గం మీడియా టుడే జూన్ 23:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో పాలకుర్తి శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 7 రకాల ధృవీకరించిన (సర్టిఫైడ్) విత్తనాల సంచులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని,వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.అనంతరం రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# బీరప్పగడ్డ అభివృద్ధికి మరో ముందడుగు

**శివ కుమార్ వినతికి స్పందించిన ఎంపీ ఈటెల**

- రూ.1.15 కోట్ల నిధుల మంజూరుకు అధికారులకు ఆదేశాలు
- పెండింగ్ అభివృద్ధి పనులకు త్వరలో పరిష్కారం
- డివిజన్ అభివృద్ధే లక్ష్యమని శివ కుమార్ వెల్లడి



**ఉప్పల్, జూన్ 23 (మీడియా టుడే ప్రతినిధి):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ యువ నాయకుడు రాచకొండ శివ కుమార్ చేసిన కృషికి ఫలితం లభించింది.బీరప్పగడ్డ డివిజన్ సమస్యలపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. డివిజన్ అభివృద్ధి పనుల కోసం రూ.1.15 కోట్ల నిధుల మంజూరుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు ఎంపీ జారీ చేసిన లేఖను మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి రాచకొండ శివ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా రాచకొండ శివ కుమార్ మాట్లాడుతూ బీరప్పగడ్డ డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.డివిజన్ అభివృద్ధికి నిధుల మంజూరుకు సహకరించిన ఎంపీ ఈటెల రాజేందర్‌కు బీరప్పగడ్డ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొనె శ్రీకాంత్, పిట్ల రాంచందర్, గుత్తి శేఖర్ రెడ్డి, ఇళేశ్వర్ గౌడ్, పిట్ల శ్రీనివాస్, అశ్విన్ బద్ర, పాస్తం సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్ పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూన్ 23 :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. సుమన్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి ఆయన వివరించారు. నేటి సమాజంలో వివిధ రూపాల్లో మత్తు పదార్థాలు ఎలా అందుబాటులోకి వస్తున్నాయో, వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. తమ పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిసినప్పుడు పోలీసులకు ఎలా సమాచారం అందించాలో విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, చిన్న కూల్‌డ్రింక్స్, జంక్‌ఫుడ్ వంటి అలవాట్లతో ప్రారంభమయ్యే అనారోగ్యకర జీవనశైలి క్రమంగా మత్తు పదార్థాల వైపు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మంచి స్నేహాలు, సానుకూల ఆలోచనల ద్వారా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను జీవితానికి దూరంగా ఉంచుకోవచ్చని తెలిపారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరితో "ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడబోమని, వాటి బారిన పడకుండా తమను తాము కాపాడుకుంటామని" ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందశీ, డాక్టర్ నాళ్ల సత్యవిద్యాసాగర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్,పులల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకుల దేవి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకులాలలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ



**మహబూబ్‌నగర్. జూన్23(మీడియా టుడే):–** మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని రెడ్డిపల్లి మినీ గురుకుల, గండీడ్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను సర్పంచ్ భగవత్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. దాంతో వారికి దిమ్మతిరిగే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ గురుకులంలో తరగతి గదులు, డార్మెటరీలు, డైనింగ్ హాల్ ,కిచెన్ సెట్లు, టాయిలెట్లను పరిశీలించారు. ప్రభుత్వం బాలికల వసతి గృహంలో టాయిలెట్లకు డోర్లు లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. తక్షణమే బాత్రూంలో డోర్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంలో అందించాలన్నారు ఈ రోజు మెనూ గురించి అడగగా వారు మేము నూతనంగా ఇన్చార్జ్ తీసుకున్నాము నాకు ఏమీ తెలియదు తెలుసుకొని విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఎప్పటికప్పుడే పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యమైన భోజనం పరిమాణము విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల అందించవలసిన కూరగాయలు నాణ్యత, టమాటా ఎండు కొబ్బెర,చింతపండు, అడ్మిషన్ సెక్షన్ అర్హత కలిగిన వారికి పాఠశాలలో అనుమతించాలని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ కి తెలిపారు. ఫుడ్ సెక్షన్ ఘోరంగా ఉండడంతో వాటిని పిల్లలకు వండి పెడుతున్నారు నాణ్యత తగ్గకుండా విద్యార్థులకు భోజనం అందించాలని వారికి వార్నింగ్ ఇచ్చి మరొకసారి ఇలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని వారు తెలిపారు. ఇలాంటి సమస్య పునరావృతం అయినట్లయితే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోతామని వారి కి హెచ్చరించారు. డిప్యూటీ సర్పంచ్ గుండాల చెన్నయ్య కేశవులు, బాబ్రీ, జగన్మోహన్ గౌడ్, వెంకటయ్య, భీమయ్య ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి

**మహిళలు అభ్యున్నతకు కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**విత్తన మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే**



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 23)** గద్వాల నియోజకవర్గంలోని గద్వాల మండల పరిధి మేళ్లచెరువు గ్రామం నందు రైతు వేదిక లో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యేకి గ్రామ సర్పంచ్ పుష్పగుచ్చం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు విత్తన మేళా ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే రైతుల కొరకు ఏర్పాటుచేసిన విత్తన మేళా స్టాల్స్ ను పరిశీలించారు.ఎమ్మెల్యే చేతులమీదుగా రైతులకు విత్తనాల ప్యాకెట్లను అందజేయడం జరిగిందిఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతుల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిన కొరకు కృషి చేయడం జరుగుతుందనారు రైతుల కొరకు ప్రత్యేకంగా విత్తన మేళా ప్రతి నియోజకవర్గంలో రైతు వేదిక దగ్గర నిర్వహించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు వ్యవసాయం కోసం రైతులు ఫర్టిలైజర్ ను వాడి పండించడం వల్ల మనకు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి కాబట్టి ప్రతి ఒక్కరు రైతులు తమ పొలాలలో సహజసిద్ధమైన విత్తనాలను వాడి మంచి పంటలు పండించాలి అప్పుడే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తానన్నారు గతంలో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయదారులు సహజసిద్ధమైన ఎరువులతో పంటలు పండించడం జరిగినది. 70, 80 ఏళ్ల వృద్ధులు కూడా ఆరోగ్యంగా జీవించే వారన్నారు ఇప్పుడు మనం పండిస్తున్న పంటలు ఫర్టిలైజర్ తో విషపూరితంగా ఉండడంతో 30 ఏళ్లకే ప్రతి ఒక్కరికి మోకాళ్ల నొప్పులు బిపి షుగర్ రకరకాల వ్యాధులతో ఇబ్బంది పడడం జరుగుతుందనారు. క్యాన్సర్ అనే మహమ్మారి గతంలో ఎవరికి తెలియదు కానీ ఇప్పుడు ప్రతి ఊరిలో ఒకరిద్దరు క్యాన్సర్ రోగులు ఉన్నారు. కాబట్టి ఫర్టిలైజర్ వాడి పంటలు పండించడం మానుకోవాలి సహజసిద్ధమైన ఎరువులతో పంటలు పండించాలి నేల కూడా సారవంతంగా ఉంటుంది. మనం పండించిన మంచి పంట లభిస్తుంది అప్పుడు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సాధ్యమవుతుందని సూచించారు ప్రతి ఒక రైతు రాబోయే రోజుల్లో కచ్చితంగా సహజ సిద్ధమైన ఎరువులతో విత్తనాలతో అధికారులు సూచించేవాటి సూచనలతో తమ పంటలను పండించుకోవాలని కోరారు గత సంవత్సరం మే నెలలోనే వర్షాలు రావడం జరిగింది కానీ ఇప్పుడు జూన్ నెల అయినా కూడా వర్షాలు రావడం లేదు ఇబ్బందిగా ఉన్నది అయినా కూడా రైతులకు నీటిని అందించడానికి ప్రభుత్వం తరపున కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ మహిళా సంఘాలలో సభ్యులుగ ఉన్నవారికి వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుంది మహిళలు కూడా ఆర్థికంగా బలోపేతం చెందాలని అన్నారు గద్వాల మండల పరిధిలో గద్వాల డిపోలో బస్సులను మహిళా సంఘలకు ఇచ్చి వాటి ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహిళా సంఘాలలో డిపాజిట్ చేయడం జరుగుతుంది అలాగే ఒక సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి కేటాయించడం జరిగింది దీని ద్వారా వచ్చే లాభంలో మహిళా సంఘాలకు అందించడం జరుగుతుందనారు అప్పుడు మహిళలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సాధ్యమవుతుందని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం రైతుల అభ్యున్నత కోసం కృషి చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ రాముడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు నరసింహారెడ్డి, నాయుడు, గంగాధర్ గౌడ్, మస్తాన్, కిట్టు, పూడూరు చిన్నయ్య, రమేష్ నాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జోగులాంబ జిల్లా మా లక్ష్యం

**జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు - మత్తుకు 'నో' చెప్పండి.. భవిష్యత్తును బంగారంగా మార్చుకోండి.**

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- అనంతపురంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు.**



**గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 23)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతపురం గ్రామశీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక చట్టపరమైన నష్టాలపై ఆయన విస్తృతంగా అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జోగులాంబ గద్వాల్ జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా, ముమ్మర తనిఖీలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు,యువత మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షణిక ఆనందం కోసం గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలైతే విద్యాభ్యాసం, కెరీర్, కుటుంబ జీవితం పూర్తిగా నాశనమవుతాయని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే చిన్న అలవాటే చివరకు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తుందన్నారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపించి తీవ్ర ఆందోళనకు గురవుతారని ఎస్పీ తెలిపారు. మత్తుకు బానిసైన వారు సులభంగా నేరాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా డ్రగ్స్ రవాణాకు లేదా విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని,ఇలాంటి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య, విదేశీ ప్రయాణాల వంటి అవకాశాలు పూర్తిగా గల్లంతవు తాయని స్పష్టం చేశారు. పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో గంజాయి అమ్మేవారి సమాచారాన్ని తెలిసిన వెంటనే డయల్-100కు లేదా పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.అనంతరం గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమన్న, ఉపాధ్యాయ బృందం, రూరల్ పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ నిత్య వెంకటేష్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మట్టి పెల్లి సైదులు ఎన్నిక

## ఎన్నిక పట్ల పలువురు హర్షం



**మోతే జూన్ 23 (మీడియా టుడే)-:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 20, 21, 22 తేదీలలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలో మోతే మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన మట్టి పెల్లి సైదులు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మట్టి పెల్లి సైదులు విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారు. 2001లో ఎస్ఎఫ్ఐ మోతే మండల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి విద్యార్థి ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారు. అనంతరం 2003లో ఎస్ఎఫ్ఐ డివిజన్ సహాయ కార్యదర్శిగా, జిల్లా నాయకుడిగా పనిచేశారు. 2004లో యువజన సంఘం డివిజన్ కార్యదర్శిగా, జిల్లా సహాయ కార్యదర్శిగా, 2007లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సేవలందించారు.2009లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట డివిజన్ మహాసభలో డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో సూర్యాపేట జిల్లా ఏర్పడిన తర్వాత తొలి జిల్లా కార్యదర్శిగా ఎన్నికై, గత 12 సంవత్సరాలుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేస్తున్నారు.గతంలో మిర్యాలగూడలో జరిగిన రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మూడు సంవత్సరాలు పనిచేసిన ఆయన, ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర నాలుగో మహాసభలో రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం విశేషం.ఈ సందర్భంగా మట్టి పెల్లి సైదులు మాట్లాడుతూ, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మరింత బలమైన పోరాటాలు నిర్మిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేసిన పలువురు మట్టి పెల్లి సైదులు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల ప్రజా సంఘాల నాయకులు, రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేశారు. గత 25 సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# సిగాచి బాధితులకు పూర్తి నష్టపరిహారం ఎప్పుడిస్తారు

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పటాన్ చెరు నియోజకవర్గ కో- ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్**

**జూన్ 30 న ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ధ్రువా చౌరస్తాలో సంస్మరణ సభకు హాజరు కానున్న మాజీ మంత్రి హరీష్ రావు**

**సిగాచి బాధితులతో కలిసి సంస్మరణ సభకు కార్మికులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని పిలుపు**




**ఇస్నాపూర్ ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 23 :** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పటాన్ చెరు మాజీ జెడ్పిటిసి, బి ఆర్ ఎస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పటాన్ చెరు పరిధిలోని సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, తీవ్రంగా గాయపడిన బాధితులకు ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని పటాన్ చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న అధికారులను గాడిలో పెట్టి,బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఏకైక నాయకుడు మాజీ మంత్రి వర్యులు శ్రీ హరీష్ రావు గారేనని తెలిపారు. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, శాశ్వత నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం పై నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగి చాలా కాలం గడిచినా ఇప్పటికీ పలువురు బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందలేదని, గాయపడిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని విడుదల చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు చొరవతోనే బాధితుల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చాయని, బాధితులకు న్యాయం జరిగే వరకు భారత రాష్ట్ర సమితి పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు. సిగాచి బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, మానవతా దృక్పథంతో వ్యవహ రించి వెంటనే పూర్తి నష్టపరిహారం అందించాలని, మృతుల కుటుంబాలకు ప్రకటించిన హామీలను అమలు చేయాలని, గాయపడిన కార్మికులకు దీర్ఘకాలిక వైద్య సహాయం మరియు ఉపాధి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు ఆదేశాల మేరకు సిగాచి బాధితుల కుటుంబాలతో కలిసి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సిగాచి ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించి వారి సమస్యలను ప్రభుత్వానికి వివరించే వేదికాగా ఈ సభ ఉంటుందని అన్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆదర్శ్ రెడ్డి, గడీల శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్స్ బేగరి గాయత్రి పాండు, మచ్చ కిషోర్ రెడ్డి, ఎల్లకొండ రాహుల్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి , బేగరి వెంకటేష్ గారు,వడ్డే గడ్డ రాజు , జనార్ధన్ రెడ్డి , పెలిమెల వెంకట్, కొమిరిశెట్టి అరుణ్ , గొంగోళ్ల నవీన్ రెడ్డి , కో ఆప్షన్ సభ్యులు విష్ణు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య

**నిందితులను వెంటనే అరెస్టు చేయాలి కలెక్టరేట్లో జర్నలిస్టుల నిరసన**

**కలెక్టర్, ఎస్పీలకు వినతి**



**మెదక్ జిల్లా మీడియా టుడే జోన్ 23,** : ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టుల పై దాడులు జరపడం హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాల నేతలు పేర్కొన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండలంలో ఓ విలేకరి పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు కలెక్టరేట్లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ యూనిస్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావులకు వేర్వేరుగా వినతి పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు మాట్లాడుతూ... నార్సింగ్ మండలంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన విలేకరి రాఘవేందర్‌పై కొందరు దాడికి పాల్పడినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వృత్తిలో భాగంగా వార్త కథనాలు ప్రచురిస్తే మీడియా ప్రతినిధుల పై దాడులు జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటువంటి దాడులు జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, రాజశేఖర్, తిమ్మన్నగారి శ్రీధర్, గోవర్ధన్ రెడ్డి, నాగరాజు శర్మ, ఫారుక్ హుస్సేన్, బొందుగుల నాగరాజు, మువ్వ నవీన్, గోపాల్ గౌడ్, కామాటి కృష్ణ, నీలం, సందీప్, శ్రీనివాస్, శ్రీనివాస్ చారి,, లక్ష్మినారాయణ, ఖయ్యూమ్, చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సంగమేష్, రహమాత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా మిగలండి :సర్పంచ్ దున్నా. శ్రీనివాస్.



**నడిగూడెం, జూన్ 23(మీడియా టుడే)-:** రక్తదానం చేసి ప్రాణ దాతలుగా మిగిలాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అవసరమైన సందర్భాలలో అందుబాటులో రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంట సందర్భాలు ఎదురవకుండా ముందస్తుగా రక్తం సేకరించి అందుబాటులో ఉంచి చికిత్స అందజేయటం వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల పిల్లల సహాయర్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంకు స్పందించి రక్తదానం చేసిన దాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం దాతలకు సంస్థ అందించిన సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.ఈ కార్. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి అజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఉమారాణి,వార్డు సభ్యులు దున్నా లింగయ్య,బాణాల సతీష్ కుమార్, షేక్ నాజియా రియాజ్,గ్రామ పెద్దలు పందిరి వెంకటరెడ్డి,గుండు శ్రీనివాస్,చిల్లంచర్ల సత్యనారాయణ,లతీఫ్ బాబు,కత్తి విజయ్,పల్లపు నాగేశ్వరరావు,మేకల వీరబాబు,శ్రీరాముల శ్రీనివాస్,తరుణ్ రెడ్డి,అనిల్, మౌలానా,బోళ్ల సీతారాంరెడ్డి,ఆర్ఎంపీ, పి.ఎం.పి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఎ.శ్రీరాములు,యలక వీరారెడ్డి,జూనియర్ అసిస్టెంట్ వంశీ,ఆశా కార్యకర్త సునిత, పంచాయతీ సిబ్బంది నాగరాజు,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**- నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపుతో అంతరాయం**

**- దేవేందర్ నగర్, వీరారెడ్డి కాలనీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ నిలిపివేత**

**- వినియోగదారులు సహకరించాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**

**ఉప్పల్, జూన్ 23 (మీడియా టుడే ప్రతినిధి):** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం (జూన్ 24) ఉప్పల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.దేవేందర్ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ పరిధిలో దేవేందర్ నగర్, గౌతమ్ నగర్, అంబేద్కర్ నగర్, రాజీవ్ నగర్, జ్యోతి నగర్, 2బీహెచ్‌కే రాజీవ్ నగర్ ప్రాంతాలు ఉన్నాయి.వీరారెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కాకతీయ కళానగర్, సీసీఎంబీ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, కమలనగర్, రాజీవ్ నగర్, ఇందిరా నగర్, గణేష్ నగర్, జ్యోతి నగర్, వీరారెడ్డి కాలనీ, మల్లాపూర్ ప్రధాన రహదారి ఎడమ వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాపై ప్రభావం ఉంటుందని అధికారులు తెలిపారు.విద్యుత్ అంతరాయంతో వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని ఏఈ/ఆపరేషన్/చిల్కానగర్ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు. 00

# తెలంగాణ మేధావులతో దిగిన ఈ ఫోటో పట్ల చాలా మందికి ఆసక్తి ఉంది

**- పవన్ కళ్యాణ్ -ట్విట్టర్ లో ఆసక్తికర ట్వీట్ చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 23:** తెలంగాణ ఉద్యమం మరియు 'సామాజిక తెలంగాణ' భావన చుట్టూ సాగిన లోతైన చర్చలతో కూడిన ఆ రోజులను ఈ ఫోటో గుర్తుచేస్తుంది అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.బహుజన భావజాలం, సామాజిక న్యాయం మరియు అణగారిన వర్గాల రాజకీయ సాధికారత వంటి అంశాలు మా చర్చల్లో ప్రధానంగా ఉండే రోజులు అవి. తెలంగాణ మేధావులతో పాటు బహుజన ఉద్యమకారులు అగస్టీన్ గారు, విప్లవ గాయకులు గద్దర్ గారు మరియు ఇతరులతో కలిసి, మేము తరచుగా తెలంగాణ భవిష్యత్తు, రాజకీయ అధికారం యొక్క న్యాయమైన పంపిణీ ఆవశ్యకత మరియు 'సామాజిక తెలంగాణ' అనే విస్తృత లక్ష్యం గురించి లోతుగా చర్చించేవాళ్ళం. నా తండ్రి శ్రీ కొణిదాల వెంకట్ రావు గారు మరణించిన తర్వాత, అగస్టీన్ గారు మరియు గద్దర్ గారు మా ఇంటికి వచ్చినప్పటి (పీఆర్పీ పార్టీ ఏర్పాటుకు ముందు నాటి) దృశ్యం ఇది. రాజకీయాలకు అతీతంగా, సామాజిక మార్పు, సమానత్వం మరియు సామాజిక న్యాయం రాజకీయ అధికారంగా మారాలనే ఆకాంక్షతో కూడిన చర్చలు జరిగిన ఆ కాలానికి సంబంధించిన ఒక మధురమైన జ్ఞాపకం ఇది.

# నర్సింహా పురం లో. ఘనంగా వితంతువుల దినోత్సవ వేడుకలు



**మునగాల జూన్ 23 (మీడియా టుడే)-:** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన వితంతువు మహిళా మూర్తులకు. శాలువతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. తదుపరి సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ కారణాలతో వివిధ అనారోగ్య సమస్యలతో. మరియు ప్రమాదవశాత్తు. అకాల మరణం చెందిన కుటుంబ పెద్ద కాలం చేసిన కాని ఎలాంటి అధైర్యానికి లోను కాకుండా ఎలాంటి. స్థిర చరాస్తులు లేకున్నా. వారి పిల్లల్లో మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారిని. మంచి ప్రయోజకులను చేసి. అలాగే ఆడపిల్లలను మంచి సంబంధాలను చూసి. వివాహాలను చేసి. మిగిలిన వారికి ఆదర్శంగా నిలిచిన. గ్రామ వితంతు మహిళా మూర్తులు ఆదర్శంగా నిలిచిన వారికి ఇలా సన్మానం చేయడం సంతోషంగా ఉందని సర్పంచ్ సత్యనారాయణ అన్నారు అలాగే సన్మానం పొందిన. వితంతు మహిళామూర్తులు. కిన్నెర కౌసల్య. కొమ్ము రాంబాయి. అల్లి లక్ష్మి . చెర్వుపల్లి వీరమ్మ . చామకూరి. కుమారి. షేక్ మైబు. షేక్ నసీర్ బాన్ మరియు పాలక వర్గ సభ్యులు. షేక్ అజీజ్ మియా పచ్చిపాల అశ్విని. పంచాయతీ కార్యదర్శి గంద్ర బాలరాజు. గ్రామ పెద్దలు రేవూరి బాబు. బాలిన నాగేశ్వరరావు . కిన్నెర స్వప్న .వీరమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

**పిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్లను వేగవంతం చేయాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్**



**ములుగు జూన్23(మీడియా టుడే)** జిల్లాలో ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి అర్హుడికి ఆధార్ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ సూచించారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, ఆధార్ సేవల పురోగతి, చిన్నారుల ఆధార్ నమోదు, విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ సమయంలోనే ఆధార్ నమోదు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోస్టల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు.5 నుండి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.18 సంవత్సరాలు పైబడిన వారి ఆధార్ నమోదు వెరిఫికేషన్ పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా ప్రవేశ పరీక్షలు, ఇతర సేవల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు తమ ఆధార్ నమోదు, అప్‌డేట్ ప్రక్రియలను ముందుగానే పూర్తి చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్వో రవికుమార్, డీఎస్పీ కిషోర్, యూఐడీఏఐ హైదరాబాద్ ఆర్వో శ్రావణ్,ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్,డీడబ్ల్యూఓ, డీఈఓ, డీఎంహెచ్‌వో, ఎల్‌డీఎం, పోస్టల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు మండల తొలి మహిళా మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.జి శివకుమారి

చిలుకూరు :-జూన్ 23(మీడియా టుడే )




చిలుకూరు మండల ఎమ్ ఇ వో గా అధికారం చేపట్టిన శ్రీమతి ఎన్.జీ. శివకుమారి మేడమ్ ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురం ఉపాధ్యాయ బృందం మరియు ఏఏపీసీ చైర్మన్ శ్రీ రాయబారపు వెంకటరమణ గారు చిరు సన్మానంతో అభినందించారు శివకుమారి మేడం సారథ్యంలో మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులకు మంచి విద్యను అందే విధంగా పర్యవేక్షణ చేయాలని మండలంలోని పాఠశాలలన్నిట్లలో మంచి మార్కులతో విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించాలని పాఠశాల విజయాలే పిల్లల భవిష్యత్తుకు నాంది అవుతాయని కొనియాడినారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వై.ఎల్.ఎన్. స్వామి, ఐ. రామాంజలి దేవి, ఎస్. అరుంధతి, డి. వెంకట్ రెడ్డి, ఎన్. పరిమళమ్మ, కె. వెంకన్న, కదిరి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొని తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడమ్ గారి నాయకత్వంలో మండల విద్యా రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగింపు దశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లాలు ఇప్పటివరకు 95, 313 మంది రైతుల నుండి 4,21,083,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,90,221 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో 928.85 కోట్ల రూపాయలు చెల్లింపు చేశామన్నారు.ఇప్పటివరకు 531 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### మిలియన్ మార్చ్,సకల జనుల సమ్మెను తలపించే విదంగా ఉప్పల్ బగాయత్ లో జూన్ 2 జరిగే భూ పోరాటం కు మెదక్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఉమ్మడి మెదక్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు వేముల భవాని పిలుపునిచ్చారు..

### ఈ సందర్భంగా మెదక్ లో టిఆర్ఎస్ పార్టీ నాయకులతో టీఎన్జీవో భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు

మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23

తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలు ఆకాంక్షలను సాధించుకునే విధంగా టిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందన్నారు.. తెలంగాణ ఉద్యమంలో కష్టపడ్డ ఉద్యమకారులను గత ప్రభుత్వం ప్రస్తుతమున్న ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.. తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమ కారులను దృష్టిలో పెట్టుకొని టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్ని వర్గాల వారికి న్యాయం చేయడం కోసం. ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది అన్నారు... ప్రతి సమస్య మీద టిఆర్ఎస్ పార్టీ అదినేత్రి ప్రశ్నించడం, సాధించడం ఆమె తత్వమన్నారు.. టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన మొదటి నుంచి ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇస్తామని టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి చెప్పడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఉద్యమకారులకు ప్రార్థన చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.. తెలంగాణ రాష్ట్రనికి మొదటి మహిళ ముఖ్యమంత్రి కవిత అవుతుందని దిమా వ్యక్తం చేశారు.

## భాజప నేతకు నివాళులర్పించిన జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి

చిలుకూరు :-జూన్ 23 (మీడియా టుడే )



చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని శ్రీనివాస్ తండ్రి భాజపా సీనియర్ నాయకులు ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్ బత్తిని పుల్లయ్య పరమపదించారు వారి భౌతిక గాయానికి సూర్యాపేట బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు పుల్లయ్య జన్మతో స్వాహా రామ భక్తులని కర సేవలో పాల్గొన్న యోధులని తన ఇద్దరు కుమారులు కూడా రామ భక్తి మార్గము లో నడిపారని ఆమె కొనియాడారు పుల్లయ్య కుమారులు వీరస్వామి బత్తిని శ్రీనివాసుని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ బాబు ఆకుల బిక్షమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కవిత రెడ్డి, బొలిశెట్టి కృష్ణయ్య బూరా మల్సూర్, శకుంతల, కనగాల నారాయణ, చిలుకూరు మండల అధ్యక్షులు పారెల్లి మహేష్, ప్రధాన కార్యదర్శి రామినేని నరసింహా వర్మ కొండ శ్రీనివాస్ ఉపాధ్యక్షులు తిప్పిరిశెట్టి బసవయ్య, సీనియర్ నాయకులు మోదుగు శ్రీనివాసరెడ్డి మునిగంటి నాగచారి అక్కినపల్లి వీరాచారి, మీసాల మట్టయ్య, కొండ భూషయ్య గ్రామ శాఖ అధ్యక్షులు బుడిగ సురేష్ వారి వెంట ఉన్నారు

## నేలకొండపల్లిలో ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

**నేలకొండపల్లి,జూన్ 23మీడియో టుడే ప్రతినిధి**




నేలకొండపల్లి మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ (వర్ధంతి) కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ నున్నా రవికుమార్.ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నున్నా రవికుమార్ మాట్లాడుతూ.దేశ ఐక్యత, అఖండత కోసంశ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం అనన్య సామాన్యమైనదనికొనియాడారు. కేదేశంలోరెండురాజ్యాంగాలు ,ఇద్దరుప్రధానులు. రెండుజెండాలుఉండకూడదన్నారు.కాశ్మీర్ పూర్తి విలీనంకోసంఆయన పోరాడి ప్రాణాలర్పించారనినున్నాగుర్తుచేశారు.వారిఆశయాలనుప్రధానినరేంద్ర మోడీ నెరవేర్చారని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయవారు చూపిన మార్గంలో దేశవ్యాప్తంగా భారతీయ జనతాపార్టీ విస్తరించిందని.రాబోయేరోజుల్లోతెలంగాణలోకూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోరాబోతుందనినున్నాచెప్పారు. తద్వారా డాక్టర్ శామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలైన అఖండభారత్నిర్మాణదిశగామనమంతా పనిచేయాలని.ఆయన ఆశయ సాధనకు,దేశ సమగ్రతకు ప్రతిఒక్కరూపునరంకితంకావాలని నున్నాపిలుపునిచ్చారు. తదనంతరంపోలింగ్ బూత్ లో మొక్కలు నాటడం జరిగిందిఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భావనాసిదుర్గారావు.షరీఫుద్దీన్,సూరేపల్లి జ్ఞాన రత్నం,మల్లబోయినగోవిందరావు పురాణందివాకర్,కట్టఅప్పారావు,పిట్టలసూరిబాబు,మూడుశీను,చెరుకుపల్లివెంకట్,మురళి,వీరబాబు,మండలపార్టీనాయకులు,వివిధమోర్చాలఅధ్యక్షులు,కార్యకర్తలుఅభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## యువత దేశాభివృద్ధికి ఉపయోగపడే వనరులు, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ నరసింహ ఐపీఎస్.- డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాల నివారణ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనలో యువత, విద్యార్థులు అంబాసిడర్ గా ఉండాలి.
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ముఖ్యం- యువత వ్యసనాలకు గురికావద్దు.
- లక్ష్యం కోసం కృషి చేయాలి -- గొప్ప వ్యక్తుల జీవితాలు ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి.
- ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధన చేయాలి.- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.




కోదాడ, జూన్ 23 (మీడియా టుడే)-:

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనంతగిరి మండల పరిధి అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పై పోలీసు ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ఉజ్వల భవిష్యత్తుపై అనుసరించాల్సిన విధివిధానాల పట్ల చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని కోరారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే వనరు కావాలి, ఇష్టం ఉన్న, నైపుణ్యం ఉన్న రంగంపై దృష్టి పెట్టాలి, గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప లీడర్స్ కావాలి అని ఎస్పి విద్యార్థులను చైతన్య పరిచారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలి, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలి అని కోరారు. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారు నేరాలకు పాల్పడుతున్నారు, అనారోగ్యాలకు గురౌతున్నారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో యాంటీ డ్రగ్ టీమ్స్ ఏర్పాటు చేశాము, విద్యాసంస్థల్లో ఈ టీమ్స్ డ్రగ్స్ నిర్మూలనకు పని చేయాలి, అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. సమాజంలో చెడ్డపేరు వస్తుంది అన్నారు. ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుంది అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన విద్యార్థులు, యువత గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము, వీరిలో మార్పునకు కృషి చేస్తాము అన్నారు. మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. సమాజంలో డ్రగ్స్ ను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అని అన్నారు. సైబర్ నేరాలు అనేవి ఇప్పుడు సమాజంలో మరో పెద్ద సమస్య అని అన్నారు, సైబర్ నేరగాళ్లు ఉచితాలు ఆశలు చూపి ఆర్థికంగా నష్టపరుస్తారు, ఓటిపి లు, పిన్ నంబర్స్ చెపితే బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు పోతాయి అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు అని ఎస్పి కోరారు. ప్రస్తుత సమాజంలో మరో ప్రధాన సమస్య రోడ్డు ప్రమాదాలు వీటివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు, విద్యార్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు అని త్రిబుల్ రైడింగ్ లాంటివి నిర్వహించకూడదని బైక్ పై పందాలు పెట్టుకోకూడదని కోరారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు కలలు పిల్లలపై పెట్టుకుంటారని రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రుల కలలను ఆశలను అందాకారం చేయకూడదని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా నిర్మూలనకు పాటుపడతాం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పోలీసు కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్, షి టీమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఏం.ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నాణ్యమైన విత్తనం అధిక దిగుబడికి పునాది

### రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23**

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ లి పిలుపునిచ్చారు.మంగళవారం, జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించి, విత్తన మేళాలో గల ఉత్పత్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు.రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సీజన్లో జిల్లాలో సుమారు 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1 లక్ష మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి నాణ్యమైన విత్తనం అత్యంత కీలకమని, మంచి పంటకు విత్తనమే పునాది అని పేర్కొన్నారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, ధృవీకరించిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించాలని సూచించారు.విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు, ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు.విత్తన మేళాల్లో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల పంట వంగడాలు, వాటి ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం, తెగుళ్ల నిరోధకత వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, వర్షాభావాన్ని తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని పొందగలరని తెలిపారు.వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగు మందుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు.రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, నాణ్యమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు.ప్రతి రైతు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరిస్తూ, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగు చేపడితే దిగుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ వ్యయాలు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు.నాణ్యమైన విత్తనం, సరైన సాగు పద్ధతులు, సమయానుకూల వ్యవసాయ సలహాలతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఉద్యానవన పంటల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని, వాటి ప్రయోజనాలపై గ్రామస్థాయి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్ సర్పంచ్ అనూష భాస్కర్ యాదవ్, ఏఎంసి చైర్ పర్సన్ కీర్తన విటల్ రెడ్డి, ఏడిఏ టెక్నికల్ వినయ్, ఏ డి ఏ నర్సాపూర్ సంధ్య, మండల వ్యవసాయ అధికారి ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువతే కీలక శక్తి

### వ్యసనాలకు కాదు.. లక్ష్య సాధనకు అడుగులు వేయాలి

### డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా ఉండాలి: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్


**మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23**



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్ టౌన్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించే లక్ష్యంతో మంగళవారం వన్-డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో యువ జనాభా అత్యధికంగా ఉందని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో వినియోగిస్తే దేశాభివృద్ధికి బలమైన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలు యువత జీవితాలను, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షణిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు అడుగులు వేయడం జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుందని, ఒకసారి వాటికి బానిసైతే ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు, కుటుంబ బంధాలు, వ్యక్తిత్వం అన్నీ దెబ్బతింటాయని హెచ్చరించారు."డ్రగ్స్‌కు 'నో' చెప్పండి... క్రీడలకు 'ఎస్' చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి యువకుడు జీవితంలో ఆచరించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, జీవితంలో విజయాలను అందుకోవడానికి క్రీడలు కూడా ఒక మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు.యువత గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు యువతకు మంచి మార్గదర్శకులుగా ఉండాలని, సమాజంలోని ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు, విద్యాసంస్థల్లో చైతన్య సదస్సులు నిరంతరం నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి డ్రగ్స్ రహిత మెదక్ జిల్లాను నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ యువతతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీ లీడ్ ప్రాజెక్ట్ సమీక్షా సమావేశానికి హాజరైన నీడ్స్ మరియు ఎస్ఈఎస్ సంస్థల డైరెక్టర్లు

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**



బోస్కో సేవా కేంద్రం హైదరాబాద్ వారు మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన 'వీ లీడ్' ప్రాజెక్టులో భాగంగా గుంటూరులో సమీక్షా సమావేశం నిర్వహించారు. 'పరిపాలనలో మహిళా సాధికారత' అనే అంశంపై రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు.గత మూడు నెలల్లో సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడానికి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడానికి ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి దాదాపు 15 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా నుండి నీడ్స్ సంస్థ డైరెక్టర్ కె. శ్రీశైలం మరియు ఎస్ఈఎస్ సంస్థ డైరెక్టర్ వి. సోమనర్సయ్య ఈ సమావేశంలో పాల్గొన్నారు. వారు తమ జిల్లాలో గత మూడు నెలలుగా మహిళా సంఘాలతో చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు, గ్రామ పంచాయతీల్లో మహిళల భాగస్వామ్యం పెంపు, నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సమావేశంలో పంచుకున్నారు.బోస్కో సేవా కేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ, "వీ లీడ్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామ స్థాయిలో మహిళలను స్థానిక పరిపాలనలో చురుకుగా పాల్గొనేలా చైతన్యపరచడం, వారి హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం మా ప్రధాన లక్ష్యం. భాగస్వామ్య ఎన్జీవోల కృషి వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి" అని తెలిపారు.సమావేశంలో పాల్గొన్న అన్ని సంస్థల ప్రతినిధులు తమ అనుభవాలు, సవాళ్లు, విజయగాథలు పంచుకున్నారు. రాబోయే మూడు నెలల కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించారు. ఈ కార్యక్రమంలో బోస్కో సేవా కేంద్రం హైదరాబాద్ డైరెక్టర్ ఫాదర్ శరత్, ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్, రీజనల్ కోఆర్డినేటర్ ఎస్. అంబేద్కర్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్లు ఏ. శిరీష, దుర్గ, ఎన్జీవో ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి వినమ్ర నివాళి

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మంగళవారం రోజు భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలదాన దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి విచ్చేసి మాట్లాడుతూ ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదనే సిద్ధాంతం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా పోరాడుతూ,1953 జూన్ 23న పోలీసు నిర్బంధంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు.భారత ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయం.డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగం సత్తిరెడ్డి,బండారు సత్యనారాయణ ,ఆంజనేయులు, వెంకటయ్య,పరకాల రాంబాబు, ఎలగందుల శ్రీను,నరసింహ, లింగస్వామి,సాయి,మధు,శంకర్, తదితరులు పాల్గొన్నారు. 0

# పెంచిన ధరలు తగ్గించాలని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**



అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం జరిగినది.ఈ ధర్నాను ఉద్దేశించి రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలు మరియు డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతు రుణమాఫీ రెండు లక్షలు పైన ఉన్న రైతులకు ఎలాంటి చర్చ లేకుండా రుణమాఫీ చేయాలని రైతు భరోసా ఎన్ని ఎకరాలు సాగు చేస్తే అన్ని ఎకరాలకు ఇవ్వాలని ఎలాంటి చర్చ లేకుండా జూన్ 30 తారీఖు వరకు రైతు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వమే రైతు బీమా చెల్లించి రైతు భీమాని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బోబ్బల లాల్ రెడ్డి,కసరబోయిన సత్తయ్య,మజ్జిగ నరసయ్య, కాల్వల నరసయ్య,అంబోజి రాములు,మార్పాక అంజయ్య, బత్తిని లింగయ్య,దుర్గపతి నరసయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బండికాడిపల్లి మల్యాల గ్రామాల్లో ఎల్లమ్మ పండుగ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**





యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం బండకాడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ ఇంట్లో ఎల్లమ్మ పండుగ ఉత్సవాల్లో పాల్గొని మరియు మల్యాల గ్రామంలో ఎల్లమ్మ పండుగలో పాల్గొన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్.వారు ఎల్లమ్మ తల్లిని తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురువాలని పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నట్లుగా తెలిపారు.వీరివెంట బిఆర్ఎస్ మండల,గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా వస్తున్న కందుల బస్తాలకు డబ్బులు వసూలు చేస్తున్న ఏఈఓలు

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన కందుల బస్తాలకు డబ్బులు వసూలు చేస్తున్న ఏఈవోలు.పల్లెపాడు క్లస్టర్ లోని ఏఈఓ ఒక బస్తాకు 200 రూపాయలు చొప్పున ,ఆత్మకూరు(ఎం)క్లస్టర్ ఏఈఓ బస్తకు వంద రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారు.రైతులు నిలదీయగా మాకు ట్రాన్స్పోర్ట్ చార్జెస్ అయినాయని చెప్తున్నారు. ఒక్కొక్క క్లస్టర్ ఒక్కొక్క విధానంగా వసూలు చేయడమేమిటి అసలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి ఇలాంటి చర్యలు పాల్పడుతున్న అగ్రికల్చర్ ఆఫీసర్ల పైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

**విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి**

**: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా వెంకటాపురం మండలం (జవహర్నగర్) జూన్23(మీడియా టుడే)**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్‌లను పరిశీలించిన విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందించుకునేలా ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.లైబ్రరీని సందర్శించి, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ అరుణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ చేసేటటువంటి బిఎల్ఓ లకు తగు సామాగ్రి మరియు కిట్లు పంపిణీ చేసిన చిలుకూరు ఎమ్మార్వో ధ్రువకుమార్

**చిలుకూరు :-జూన్ 23(మీడియా టుడే )**



చిలుకూరు మండలం లో ఉన్నటువంటి 17 గ్రామాలలో ఉన్న ఓట్ల జాబితాను పరిశీలన చేస్తూ మరియు కొత్తగా ఓటు హక్కును పొందే వారిని ఓటు హక్కును పొందుటకు తగు సూచనలు సలహాలు ఇస్తూ మండలంలోని 38 పోలింగ్ స్టేషన్లకు గాను 38 మంది బిఎల్వోలు మరియు నలుగురు సూపర్వైజర్లు విధుల్లో నియమించడం జరిగింది ఈ ఓటర్ల జాబితా సవరణకు గాను నియమించిన అధికారులకు కావలసినటువంటి పత్రాలు మరియు సంబంధిత సామగ్రిని చిలుకూరు మండల ఎమ్మార్వో దృవ్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది ప్రస్తుతం మండలంలో 33,000 మంది ఓటర్లు ఉన్నట్టు ఎమ్మార్వో పేర్కొన్నారు జరగబోయే సవరణలో ఉన్న ఓట్లతో పాటు కొత్త ఓటర్లతో కలిగిన మొత్తం ఓటర్ల జాబితాను త్వరలో తెలియపరుస్తామన్నారు ఇట్టి కార్యక్రమంలో ఆర్ ఐ శ్వేత,ఆర్ ఐ సీత్రమాచాద్రరావు, సీనియర్ అసిస్టెంట్పుష్పలత ,రజిని,నరసయ్య,రాజు,గిద్దె లింగయ్య,బిల్ఓ లు బచ్చు రమేష్,జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# గురిజాల రైతు వేదికలో ఘనంగా సీడ్ మేళా ప్రారంభం

**ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా ప్రారంభం**

**- వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు సూచనలు**



**వరంగల్ జిల్లా బ్యూరో, జూన్ 23 ,మీడియా టుడే.**
ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నర్సంపేట మండలంలోని గురిజాల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సీడ్ మేళా కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ కలిగి ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలకు మాత్రమే బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ఆమోదిత విత్తనాలను మాత్రమే వినియోగించాలని, అందుకే సీడ్ మేళాలో అధీకృత డీలర్ల ద్వారా ఆయా విత్తనాలను విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ఒకవేళ వర్షాభావ పరిస్థితులు నెలకొంటే పప్పుధాన్యాలు, జొన్న, నువ్వులు, కూరగాయలు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని, రెండో దఫా నుంచి నానో యూరియాను తప్పనిసరిగా ఉపయోగించాలని రైతులకు సూచించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. రైతులు అంతర పంటలను ప్రోత్సహించడంతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.సీడ్ మేళాలో ఒకే చోట నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలై శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డీహెచ్‌వో శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్‌లు గురిజాల చంద్రరావు, చిన్న గురిజాల కమలాకర్, జీజీఆర్‌పల్లి బుస నర్సయ్య, గుంటూరుపల్లి రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్ హుస్సేన్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సర్ ఓటరు జాబితా సవరణను తప్పులేకుండా నిర్వహించాలి

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్నగర్ మీడియా టుడే ప్రతినిధి:**
జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎటువంటి తప్పులు, లోటుపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ) సూచించారు.మంగళవారం హన్వాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బి ఎల్ ఓ ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి బి ఎల్ ఓ తనకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతి ఇంటిని జూన్ 25 నుండి జూలై 24 వరకు సందర్శించి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి వారి వివరాలను సేకరించాలని తెలిపారు. ప్రతి ఫారంపై ఓటరు తాజా ఫొటోను తప్పనిసరిగా అతికించాలని సూచించారు. ఓటర్ల వివరాలను సేకరించే సమయంలో వాటిని కచ్చితత్వంతో నమోదు చేయాలని, ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా సక్రమంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 2002 ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాతో పోల్చి వివరాలను పరిశీలించాలని, ఏవైనా వ్యత్యాసాలు గుర్తించినట్లయితే సంబంధిత ధ్రువపత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సవరణలు చేపట్టాలని చెప్పారు.పాత, కొత్త ఓటరు జాబితాల మధ్య మిస్‌మ్యాచింగ్ కారణంగా ఆన్‌లైన్ ద్వారా నోటీసులు వచ్చిన వెంటనే సంబంధిత ఓటర్లకు వాటిని అందజేసి, అవసరమైన పత్రాలను సేకరించి వివరాలను నవీకరించాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా వెళ్ళిపోయిన, ఓటర్లను తొలగించే ముందు నోటీసులు ఇచ్చి భారత ఎన్నికల కమిషన్ నిర్దేశాలను అనుసరించి మాత్రమే చేయాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు ఓటు హక్కు పోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు.హన్వాడ మండలంలో 48 పోలింగ్ కేంద్రాలకు 48 మంది బూత్ లెవల్ అధికారులను నియమించినట్లు మండల తహసీల్దార్ కిస్త్యా నాయక్ కలెక్టర్‌కు వివరించారు. సర్ ప్రక్రియపై బి ఎల్ ఓలకు సమగ్ర శిక్షణ ఇచ్చి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఓటర్ల పేర్లలో, అక్షరదోషాల్లో, ఇంటి చిరునామాల్లో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన సందర్భాల్లో సరైన ధ్రువపత్రాల ఆధారంగా మాత్రమే సవరణలు చేపట్టాలని, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు.
ఈ సమావేశంలో మండల తహసీల్దార్ కిష్టా నాయక్, ఎం.పి.డి.ఓ యశోదమ్మ, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# విత్తన మేళా  రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల కార్యక్రమం ప్రారంభం

**మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో మంగళవారం రోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పల్లెర్ల రైతు వేదికలో "విత్తన మేళా – – రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పంటల వైవిధ్యీకరణ మరియు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వరి సన్న రకాల విత్తనాలు, కంది, పెసర, మినుము విత్తనాలతో పాటు నానో డీఏపీ (ఘీుఅశీ ణూూ), నానో యూరియా (ఘీుఅశీ ఖతీమ) ఉత్పత్తులను ప్రదర్శించారు. రైతులు ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించి, వాటి వినియోగం మరియు ప్రయోజనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంట మార్పిడి విధానాలు, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. భూమి సారాన్ని కాపాడుకుంటూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. అశోక్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ప్రతి సంవత్సరం ఒకే పంటను సాగు చేయడం వల్ల భూమిలోని పోషకాలు క్షీణించి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధిక పోషకాలు అవసరమయ్యే వరి, పత్తి వంటి పంటల తరువాత తక్కువ పోషకాలు అవసరమయ్యే కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్య పంటలను సాగు చేయడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు.గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహా మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే కాలంలో వర్షాభావం మరియు నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు వరి సాగును పరిమితం చేసి, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాజశేఖర్, వేణు, క్రాంతి కుమార్, సౌమ్య, రైతులు తండ నర్సింహా, నరేందర్ రెడ్డి, రామలక్ష్మయ్య, మాధవ రెడ్డి, సుజాత, అండాలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలి

**- సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు హీూ. వజీర్.**

**- కోల్, యాష్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగుల ధర్నా.**

**- టెండర్లు రద్దు చేయాలని డిమాండ్..**




**మణుగూరు,జూన్ 23( మీడియా టుడే):**
మణుగూరు: విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని టీజీపీఈ (తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) జేఏసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు, కార్మిక సంఘం–1535 రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ. వజీర్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. వైటీపీఎస్‌లోని కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రతిపాదనను నిరసిస్తూ టీజీపీఈ జేఏసీ, టీఈఈ (తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్) జేఏసీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బీటీపీఎస్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కర్మాగారంలోని అడ్మినిస్ట్రేషన్ భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన గేటు వరకు గంటపాటు సాగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బ్యానర్లతో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఏ. వజీర్ మాట్లాడుతూ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు.వైటీపీఎస్‌లోని కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్లను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైటీపీఎస్‌తో పాటు జెన్‌కో పరిధిలోని ఇతర విద్యుత్ కేంద్రాలను కూడా పాక్షికంగా ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.టీజీపీఈ జేఏసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, టీఈఈ జేఏసీ కన్వీనర్ చందు మాట్లాడుతూ, వైటీపీఎస్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సెంట్రల్ జేఏసీ ఆదేశాల మేరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో సెంట్రల్ జేఏసీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీజీపీఈ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి. రవిప్రసాద్, టీఎస్ఈఏఈఏ నాయకులు మహేష్, టీఈఏఈఏ నాయకులు రమేష్, కార్మిక సంఘం–1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం–1104 అధ్యక్షులు బి. సత్యనారాయణ, కార్మిక సంఘం–327 ప్రధాన కార్యదర్శి పి. సాంబ, ఏఐటీయూసీ నాయకులు టి. శోభన్, క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ సిద్దుల హుస్సేన్, బీసీ అసోసియేషన్ నాయకులు కృష్ణకాంత్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు వి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఓటరు జాబితా సవరణను తప్పులేకుండా నిర్వహించాలి

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్నగర్ మీడియా టుడే ప్రతినిధి:**





జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎటువంటి తప్పులు, లోటుపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ) సూచించారు.మంగళవారం హన్వాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బి ఎల్ ఓ ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి బి ఎల్ ఓ తనకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతి ఇంటిని జూన్ 25 నుండి జూలై 24 వరకు సందర్శించి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి వారి వివరాలను సేకరించాలని తెలిపారు. ప్రతి ఫారంపై ఓటరు తాజా ఫొటోను తప్పనిసరిగా అతికించాలని సూచించారు. ఓటర్ల వివరాలను సేకరించే సమయంలో వాటిని కచ్చితత్వంతో నమోదు చేయాలని, ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా సక్రమంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 2002 ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాతో పోల్చి వివరాలను పరిశీలించాలని, ఏవైనా వ్యత్యాసాలు గుర్తించినట్లయితే సంబంధిత ధ్రువపత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సవరణలు చేపట్టాలని చెప్పారు.పాత, కొత్త ఓటరు జాబితాల మధ్య మిస్‌మ్యాచింగ్ కారణంగా ఆన్‌లైన్ ద్వారా నోటీసులు వచ్చిన వెంటనే సంబంధిత ఓటర్లకు వాటిని అందజేసి, అవసరమైన పత్రాలను సేకరించి వివరాలను నవీకరించాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా వెళ్ళిపోయిన, ఓటర్లను తొలగించే ముందు నోటీసులు ఇచ్చి భారత ఎన్నికల కమిషన్ నిర్దేశాలను అనుసరించి మాత్రమే చేయాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు ఓటు హక్కు పోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు.హన్వాడ మండలంలో 48 పోలింగ్ కేంద్రాలకు 48 మంది బూత్ లెవల్ అధికారులను నియమించినట్లు మండల తహసీల్దార్ కిస్త్యా నాయక్ కలెక్టర్‌కు వివరించారు. సర్ ప్రక్రియపై బి ఎల్ ఓలకు సమగ్ర శిక్షణ ఇచ్చి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఓటర్ల పేర్లలో, అక్షరదోషాల్లో, ఇంటి చిరునామాల్లో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన సందర్భాల్లో సరైన ధ్రువపత్రాల ఆధారంగా మాత్రమే సవరణలు చేపట్టాలని, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో మండల తహసీల్దార్ కిష్టా నాయక్, ఎం.పి.డి.ఓ యశోదమ్మ, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## 25న షాబాద్ గిరిజన తాండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**మెదక జిల్లా మీడియా టుడే,జూన్23**




:మెదక్ జిల్లా, టేక్మాల్ మండల పరిధిలోని షాబాద్ గిరిజన తాండాలో ఈనెల 25 నుండి27 వరకు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రభు,లునావత్ పవన్ నాయక్,రమావత్ సర్దార్ నాయక్ లు ఆదివారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న(గురువారం)ఉదయం గణపతి పూజ,పుణ్యాహ వచనం,గురు ప్రార్థన,అఖండ దీపారాధన,తదితర కార్యక్రమాలు,26న(శుక్రవారం) మండప పూజలు,అన్నదివాసం, కనక దివాసం,పుష్ప దివాసం,మూల మంత్ర హోమం,మండప దేవత హోమం,తదితర కార్యక్రమాలు 27న(శనివారం)మండప పూజలు,దుర్గా భవాని,సేవాలాల్ పంచామృతం, మహాభిషేకం,యంత్ర ప్రతిష్ఠ,విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, సాయంత్రం 04.00గం.కు బోనాలు సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయా గిరిజన తాండాలోనీ సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వర్షాకాల వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

**వరంగల్ జిల్లా బ్యూరో జూన్ 23, మీడియా టుడే.**



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సాంబశివరావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు.మంగళవారం ఖానాపూర్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రంలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని పరిశీలించి, స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు.అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో గర్భిణుల నమోదు, ప్రసూతి ముందు మరియు తరువాత అందిస్తున్న వైద్య సేవలు, శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల గుర్తింపు, క్షయవ్యాధి నియంత్రణ చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.ప్రతి గర్భిణి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ మాతా–శిశు మరణాలను తగ్గించే దిశగా పనిచేయాలని సూచించారు. టీబీ వ్యాధిగ్రస్తులను ముందస్తుగా గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, అతిసార వ్యాధుల నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు.ఈ నెల 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని, జూలై 13న నిర్వహించనున్న జాతీయ డీ-వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, వైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ సునీత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సయ్యద్ జమీరుద్దీన్, సూపర్వైజర్ దామోదర్ రెడ్డి, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక సహాయం అందజేసిన అయిటిపాముల రవీంద్ర


**మీడియా టుడే వలిగొండ జూన్ : 23**



, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పోలేపాక రాములు ఇటీవల కాలు విరిగినది. పోలపాక రాములు కుటుంబం ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులకు గురికాగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిటిపాముల రవీంద్ర పోలేపాక రాములుకు 10,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, జిల్లా నాయకులు కాసుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి గా ఏ.రాంగోపాల్ నియామకం

**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి జూన్ 23**



కల్వకుర్తి ప్రాంతానికి చెందిన న్యాయవాది ఏ .రాంగోపాల్ నాగర్ కర్నూల్ జిల్లా సెకండ్ క్లాస్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈ నియామకం ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జారీ చేసింది. గత 14 సంవత్సరాలుగా న్యాయవాదిగా కల్వకుర్తి జూనియర్, సీనియర్ కోర్టులో సేవలు కొనసాగించారు. సెకండ్ క్లాస్ కోర్టు జడ్జిగా ఏ. రాంగోపాల్ నివాసం పై కల్వకుర్తి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

### తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా



**మీడియా టుడే,జూన్ 23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ మండలాల్లో నెలకొన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు.భువనగిరి పట్టణంలో వందన కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రభుత్వమైనా జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను పరిష్కరించి ఇడ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టులకు సొంత ఇండ్లు లేక అద్దె ఇండల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టి జె ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగరాజు,కదిర్, భువనగిరి మండల కార్యదర్శి అల్తాఫ్,గుండాల అధ్యక్షులు నరేష్, మోత్కూర్ అధ్యక్షులు నర్సింహా, అడ్డగూడూర్ అధ్యక్షులు సందీప్, తుర్కపల్లి కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

# పాఠశాలల బంద్ విజయవంతం

### విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

### రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్




**ఇబ్రహీంపట్నం, జూన్ 23(మీడియా టుడే)**
విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం పరిధిలో ప్రైవేట్ , ప్రభుత్వ పాఠశాలలు విజయవంతంగా బంద్ నిర్వహించడం జరిగింది. ఏబీవీపీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్ మాట్లాడుతూ..విద్యార్థుల హక్కులు మరియు నాణ్యమైన విద్య కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలను మూసివేయడం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.ఖాళీగా ఉన్న ఎంఈఓ, డి ఈ ఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి.గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి.బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ను అన్ని పాఠశాలలో తక్షణమే అమలు చేయాలి.విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్రపల్లి మహేందర్ , ఏబీవీపీ స్టేట్ ఎస్ ఎఫ్ ఎస్ కో కన్వీనర్ పుప్పాల ఆదర్శ్ ,భరత్ వంశీ , పవన్, కార్తీక్ , మహేష్ , హనుమంతు, నవదీప్ తదితరులు పాల్గొన్నారు

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

### ఎస్పీ రోహిత్ రాజు - విద్యార్థుల్లో డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఎస్పీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 23(మీడియా టుడే):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, యువత దేశానికి వెన్నుముక వంటివారని, క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తుతో పాటు తల్లిదండ్రుల ఆశలను కూడా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాలు దెబ్బతినడంతో పాటు కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు.విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సినిమాల్లోని మంచి అంశాలను మాత్రమే స్వీకరించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి ఎదురైనప్పుడు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరారు.అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలామంది మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఓటీపీ ట్రాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని, మహిళలు, విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.రోడ్డు భద్రతపై మాట్లాడుతూ, స్వీయ క్రమశిక్షణతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడ్ వల్ల జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు, పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎయిర్‌పోర్టు కల సాకారానికి మరో ముందడుగు

- కొత్త స్థలంపై కేంద్రానికి ప్రతిపాదనలు
- 10 రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం.



**న్యూఢిల్లీ, జూన్ 23 (మీడియా టుడే):**
దశాబ్దాలుగా భద్రాద్రి జిల్లావాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడిని కలిసి భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై చర్చించారు.గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో విద్యుదీకృత రైల్వే మార్గం, కొండలు సమీపంలో ఉండటంతో విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భద్రతా ప్రమాణాలు సాధ్యం కాదని ఫీజిబిలిటీ అధ్యయనాల్లో తేలినట్లు మంత్రి తుమ్మల వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి, సమగ్ర నివేదిక కోసం ఏవియేషన్ సంస్థను నియమించినట్లు తెలిపారు.కొత్తగా ప్రతిపాదించిన స్థలంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఫీజిబిలిటీ నివేదికను పది రోజుల్లో సమర్పించాలని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రక్రియలను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయానికి జూలై నెలలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయానికి రక్షణ శాఖ అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.సింగరేణి బొగ్గుగనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి పరిశ్రమలు, ఎకో టూరిజం అవకాశాలు, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత ఊతమిస్తుందని తెలిపారు. దీంతో విద్య, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, మౌలిక సదుపాయాలు, అనుమతుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్ - నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 23(మీడియా టుడే):**
ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాథపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం స్టాళ్లను పరిశీలించి విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి ప్రామాణికతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.నకిలీ విత్తనాల విక్రయం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ విత్తనాలు, యూరియా అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, తహసీల్దార్ ధారాప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## టాక్సీ డ్రైవర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం

### టాక్సీ డ్రైవర్లను ప్రభుత్వం పట్టించుకోవాలి శివప్రసాద్




**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి జూన్23**
: తెలంగాణ టాక్సీ డ్రైవర్ మరియు ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంషాబాద్ లో మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది .ఈ వార్షికోత్సవానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల, పట్టణాల్లో ఉన్న సౌత్ ఇండియా టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పుదుచ్చేరి తమిళనాడు కర్ణాటక గోవా,తెలంగాణ కేరళ ఆంధ్ర ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన వందలాది మంది డ్రైవర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం టాక్సీ డ్రైవర్ల మధ్య వైట్ నెంబరు ప్లేట్ల పంచాయితీ ఎక్కువగా ఉందని కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కారు వైట్ ప్లేట్ల వాహనాలతో ఎక్కువగా నష్టం జరుగుతుందని అందుకే 6 రాష్ట్రాల వారిని ఈ సమావేశానికి పిలిపించి తెలంగాణ టాక్సీ డ్రైవర్ ?స అసోసియేషన్ (టి డి టిడిపి)ఆ సమస్యను పరిష్కరించేదిశ లో చర్చలుజరుపుతున్నామన్నారు. తమకు ప్రభుత్వం నుంచి ట్యాక్సీలు తక్కువ కావాలని కోరుతున్నామన్నారు తెలంగాణ స్టేట్ నుంచి తమిళనాడుకు వెళ్తే స్టాంపు వేసుకొని పంపించి వేస్తున్నారు. అదే తెలంగాణ స్టేట్ నుంచి ఆంధ్రప్రదేశ్ కి వెళ్తే 3,500 టాక్సులు వసూలు చేస్తున్నారని ఇదెక్కడి అన్యాయమని ఆయన ప్రశ్నించారు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఒక న్యాయం అదే తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తే టాక్స్ ఎందుకు వేస్తున్నారు ఎక్కడ న్యాయమని ఆయన ధ్వజమెత్తా రు. అనంతరం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం టాక్సీ డ్రైవర్ సహకరించి యాక్షన్ తగ్గించాలని ఇద్దరు సర్టిఫికెట్లు కూడా తొందరగా అందించాలని చెప్పారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టాక్సీ డ్రైవర్లకు సంబంధించిన ధరలు తగ్గించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించాలని అందుకోసం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు తెలంగాణ నుంచి ఎక్కువమంది టాక్సీ డ్రైవర్ తమిళనాడు కేరళ కర్ణాటక గతంలోని రాష్ట్రాల్లో ప్రయాణిస్తే డ్రైవర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇవ్వాలని ఒకవేళ టార్చి చెడిపోతే ఆ వాహనాన్ని బాగు చేయించి వెలిగి తీసుకురావడానికి కనీసం ప్రారంభోజులు పట్టేదని ఇప్పుడు అసోసియేషన్ ఏర్పాటు చేయడం వల్ల అసోసియేషన్ సభ్యులకు సమాచారం పెడితే కొన్ని గంటల యోధుల్లోనే ఆ వాహనాన్ని బాగు చేయించి ఎంతో సహకరిస్తున్నారని అందువల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు అలాగే ప్రభుత్వం కూడా సహకరించి వారి వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శివప్రసాద్ ప్రధాన కార్యదర్శి నరసింహ చారి కోఆర్డినేటర్ ఎం శ్రీకాంత్ బి మహేందర్ శ్రీ ప్రశాంత్ కోశాధికారి ప్రశాంత్ గౌడ్ ఉప అధ్యక్షులునాగుల మహేష్ రమేష్ రణధీ ర్ కిరణ్ కుమార్ సంతోష క విజయ్ రవి మహేష్ బాలరాజు సంతోష్ మహేందర్ శ్రీకాంత్ బి మహేందర్ పాలమాకుల విజయ్ తదితరులు పాల్గొన్నారు

## ఏడుపాయల చెక్ డ్యాంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృత దేహం లభ్యం

మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23)



ఏడుపాయల చెక్ డ్యాంలో సుమారు (55) సం. వయసు గల ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చెక్ డ్యాంలో ఓ వృద్ధురాలి మృతదేహం గమనించిన స్థానికులు పాపన్న పేట పోలీసులకు సమాచారం అందజేయడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి మృతురాలి ఆచూకీ కోసంపరిశీలించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదని. మృతురాలి దేహంపై బ్లూ కలర్ నైట్ తోపాటు,చెవులకు రేడిమేట్ కమ్మలు,ముక్కు పుడక ఉందని,మృతురాలి ఫోటో ఆధారంగా మృతురాలిని గుర్తించిన వారు పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ చరవాణి 87126 57920,మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి 87126 57883 చరవాణి లకు సంప్రదించాలని వారు కోరారు.

## ఏడు రకాల సన్న వడ్లు రైతులకు పంపిణీ

### సర్పంచుల సంఘం అధ్యక్షులు రగ్యారి భగవంతు రెడ్డి

మహబూబ్‌నగర్. జూన్ 23
(మీడియా టుడే):-



సన్న వడ్లు సాగు రైతులకు లాభం... రాష్ట్రానికి అభివృద్ధి...అని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఏడు రకాల సన్నవడ్ల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుందని సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భగవంతు రెడ్డి తెలిపారు.మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సన్నారకం వడ్ల విత్తనాలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి ఏవో సమక్షంలో రైతు వేదిక ఆవరణలో రైతులకు అవగాహన కల్పిస్తూ సన్న వడ్ల సాగు రైతులకు లాభం రాష్ట్రానికి అభివృద్ధి ఆశ్రయంలో వడ్ల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు తమ అవసరాలకు నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళా పాల్గొని తమ కావాల్సిన విత్తనాలను కొనుగోలు చేశారు. క్వింటాల్కు 500 బోనస్ ప్రభుత్వ ప్రోత్సాహంగా రైతులకు అందిస్తున్నామని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నారెడ్డి, డిప్యూటీ సర్పంచ్ చెన్నయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్ రావు, లక్ష్మీనారాయణ, రైతు సురేష్ గౌడ్ శ్రీనివాస్ సాయన్న కేవలం శ్రీకాంత్ వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలి..ఏఐటీయూసీ

- ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సరికాదు: మిర్యాల రంగయ్య.
- రిలే నిరాహార దీక్షలకు వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు.

మణుగూరు,జూన్ 23( మీడియా టుడే):



మణుగూరు ఏరియా పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, మణుగూరు ఓసీపీ మూసివేయకముందే ఎక్స్‌టెన్షన్ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవ్ మణుగూరు' రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో కొనసాగుతున్న దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడారు. 1974 నుంచి సింగరేణి మనుగడతో మణుగూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆయన అన్నారు. ప్రస్తుతం 6 వేల మందికి పైగా శాశ్వత, కాంట్రాక్టు కార్మికులు ఉపాధి పొందుతున్నారని, సింగరేణి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు.పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్ 170 యాక్ట్ పరిధిలో ఉన్నందున దానిని ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ చట్టం, దానికి అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు తెలపడం వల్లే సింగరేణికి దక్కాల్సిన బొగ్గు బ్లాకులు వేలానికి వెళ్లాయని ఆరోపించారు.సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందని గుర్తు చేసిన మిర్యాల రంగయ్య, మణుగూరు అభివృద్ధికి జీవనాడిగా ఉన్న పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్, ఎంఎన్‌జీ ఓసీ అనుమతుల అంశాలపై స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలని కోరారు. రాజకీయ పార్టీలు సింగరేణిపై రాజకీయాలు మానుకుని, తెలంగాణకు కొంగుబంగారంగా ఉన్న సంస్థకు బొగ్గు గనుల కేటాయింపుపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిలోని బొగ్గు బ్లాకులను ప్రభుత్వ రంగ సంస్థకే కేటాయించాలని, లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాగ్రహానికి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు గురికావాల్సి వస్తుందని అన్నారు.ఈ దీక్షా శిబిరాన్ని సీపీఎం నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు బృందం, మణుగూరు ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం, బొగ్గు ముఠా సంఘం, వర్తక సంఘం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, బీఆర్ఎస్ నాయకులు కొత్తగట్ల రామచందర్ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, సీపీఐ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి సరేడ్డి పుల్లారెడ్డి, మహిళా రాష్ట్ర నాయకురాలు మున్నా లక్ష్మీకుమారి, సీపీఐ టౌన్ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఎస్సీసీడబ్ల్యూయూ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామనరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్లు, పిట్ సెక్రటరీలు, డెలిగేట్లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ఫైర్ సేఫ్టీ లేని ప్రైవేటు స్కూల్ ల పైన చర్యలు తీసుకోవాలి

**జిల్లా డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కి వినితి**

**బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు**

**జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య**

గద్వాల జిల్లా మీడియా టుడే ప్రతినిధి జి నాగరాజు (జూన్ 23)



గద్వాల జిల్లా కేంద్రంలోని డిస్టిక్ ఫైర్ ఆఫీసులో బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో ప్రతి ప్రైవేటు స్కూల్లలో ఫైర్ సేఫ్టీ లేటెస్ట్ సర్టిఫికెట్ ఉండాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ జిల్లాలోని చాలా ప్రైవేట్ స్కూల్స్ ఫైర్ సేఫ్టీ లేకుండగా నడుపుతున్నారు.ఫైర్ సేఫ్టీ లేని స్కూల్స్ లలో ప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరిగే పరిస్థితి ఉంది.విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రవేట్ స్కూల్ కూడా ఫైర్ సేఫ్టీ లేటెస్ట్ సర్టిఫికెట్ ఉండాలి కానీ డీఈవో దీని పైన చర్యలు తీసుకోవడం లేదు తక్షణమే జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్స్‌లో ఫైర్ సేఫ్టీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. లేని స్కూళ్ల పై చర్యలు తీసుకొని ఆ స్కూల్ యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి, నరసింహ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి

**పెండింగ్ రైతు భరోసా నిధులు విడుదల చేయాలి- నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలి**

**తెలంగాణ రైతు సంఘం తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా.**





తొర్రూరు,జూన్ 23( మీడియా టుడే)
సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యాప్ తో సంబంధం లేకుండా యూరియా సరఫరా చేయాలి అని, పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు తొర్రూరు మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్ ఐ విక్రమ్,జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్, మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ, వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని రైతులకు కల్తీ విత్తనాలు, పురుగుమందులు అందకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవకాశం ఉంటుంది అని , కల్తీ,నాసిరకం విత్తనాలు పంపిణీ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట కాలువలు మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయింది అని పంట కాలువలు మరమ్మతులు చేయాలి అని అన్నారు. రబి సీజన్లో మార్కెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న రైతులకు పెండింగ్ డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం కరువు పరిస్థితులు రాబోతున్నట్టు తెలుస్తుందని అందుకోసం ప్రభుత్వం తక్షణ స్పందించి యాక్షన్ ప్లాన్ రూపొందించి రైతులను ఆదుకోవాలనికోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ , మండల అధ్యక్షురాలు అందే మంజుల రైతు సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు వీరయ్య, కోటగిరి సంతోష్, శ్రీరంగం రాధా రామకృష్ణ, భాగ్య ,సమీనా, అమీనా, శ్రీలత ,లక్ష్మి ,స్వర్ణ, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న తుర్కపల్లి పోలీసులు



మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో అంతరాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న తుర్కపల్లి పోలీసులు.పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ బిజీ శ్రీశ్రీ పత్తి విత్తనాలు -- 150 కిలోలు మరియు 01 నిందితుడు అరెస్ట్ క్రైమ్ నం.120/2026, యూ/ఎస్ 318(4), 223 బిఎన్ఎస్, సెక్షన్ 19 ఆర్/డబ్ల్యూ 7 సీడ్స్ అక్ట్ ,12(2) తెలంగాణ కాటన్ సీడ్స్ అక్ట్ -2007, 15(1) ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అక్ట్(ఈపీఏ),తుర్కపల్లి పోలీస్ స్టేషన్."నిందితుల వివరాలు": ఎ1: దొండపాటి మల్లికార్జునరావు, తండ్రి వెంకటేశ్వరరావు, వయస్సు 36 సంవత్సరాలు, కేశనపల్లి గ్రామం, దాచేపల్లి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం; ఎ2 : శంకర్, తండ్రి వెంకటరమణ, బి. కొత్తకోట, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (పరారీలో ఉన్నాడు).స్వాధీనం చేసుకున్న విత్తనాలు:(1)."బిల్లా బిజీ శ్రీశ్రీ 999" పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు సుమారు 70 కిలోలు (2 సంచుల్లో).(2).విడిగా ఉన్న నకిలీ/కల్తీ పత్తి విత్తనాలు సుమారు 80 కిలోలు (3 సంచుల్లో). మొత్తం విలువ సుమారు రూ.10,00,000/-సంఘటన వివరాలు: విశ్వసనీయ సమాచారంపై తుర్కపల్లి పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్ స్టాండ్ ముందర దొండపాటి మల్లికార్జునరావుకాను వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను గుంటూరు నుండి సిద్ధిపేటకు నిషేధిత బిజీ ×× పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.విచారణలో ఎ1 దొండపాటి మల్లికార్జునరావు, చిత్తూరు జిల్లాకు చెందిన ఎ2 శంకర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నకిలీ బిజీ -×× పత్తి విత్తనాలను కొనుగోలు చేసి, రవాణా చేసి, విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైంది. పోలీసుల ప్రశ్నించగా, తాను రైతులకు అధిక దిగుబడి వస్తుందని, మంచి పంట ఉత్పత్తి కలుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు.మొత్తం ఐదు సంచుల్లో ఉన్న క్రింది విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు: "బిల్లా బిజీ -×× 999" పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు -- 70 కిలోలు (2 సంచులు); విడిగా ఉన్న నకిలీ/కల్తీ పత్తి విత్తనాలు -- 80 కిలోలు (3 సంచులు).స్వాధీనం చేసిన విత్తనాల నిల్వ, రవాణా మరియు విక్రయాలకు సంబంధించి నిందితుడు ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, బిల్లులు, ఇన్వాయిస్‌లు, రవాణా అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు లేదా అధికార పత్రాలను సమర్పించలేకపోయాడు. పరారీలో ఉన్న ఎ2 శంకర్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి."రైతులకు సూచన" : ఇలాంటి నిషేధిత మరియు నకిలీ పత్తి విత్తనాల వినియోగం వల్ల విత్తనాల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు విఫలమవడం మరియు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ నకిలీ విత్తనాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండవు మరియు వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇలాంటి విత్తనాల నిరంతర వినియోగం భూసారాన్ని దెబ్బతీయడమే కాకుండా నేల కాలుష్యానికి కూడా దారితీయవచ్చు. రైతులు అదనంగా పురుగుమందులు, ఎరువులు మరియు తిరిగి విత్తడం కోసం అధిక ఖర్చు చేయాల్సి రావడంతో సాగు వ్యయం పెరుగుతుంది. ఈ విధమైన అక్రమ కార్యకలాపాలు రైతు సమాజానికి మరియు వ్యవసాయ రంగానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. "పోలీసుల చర్యలు": యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు రైతులకు భారీ ఆర్థిక నష్టాలు కలిగించే నకిలీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. నకిలీ విత్తనాల తయారీ, రవాణా మరియు విక్రయాల్లో పాల్గొంటున్న ముఠాలను గుర్తించి నిర్మూలించేందుకు నిరంతర చర్యలు కొనసాగుతున్నాయి. ఈ అక్రమ కార్యకలాపాలలో పాల్గొనే ప్రతి ఒక్కరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి."ప్రజలకు విజ్ఞప్తి": నకిలీ విత్తనాల నిల్వ, విక్రయం లేదా రవాణా గురించి విశ్వసనీయ సమాచారం తెలిసిన రైతులు మరియు ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోబడతాయి."పర్యవేక్షణ":ఈ ఆపరేషన్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అక్షాంశ్ యాదవ్,ఐపిఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, అదనపు ఎస్పీ చి. లక్ష్మీనారాయణ సహకారంతో నిర్వహించారు. అలాగే పి. శ్రీనివాస్ నాయుడు,ఎస్డిపీఓ, యాదాద్రి డివిజన్,ఎం. శంకర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్, మొహమ్మద్ తకియుద్దీన్, ఎస్ఐ, తుర్కపల్లి పోలీస్ స్టేషన్, కె.శ్రీఉమ,మండల వ్యవసాయ అధికారి, తుర్కపల్లి మండలం, మరియు తుర్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది మార్గ దర్శకత్వంలో ఈ దాడి నిర్వహించబడింది అని తుర్కపల్లి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో భారీగా ఎస్ డబ్ల్యు ఎఫ్‌లో చేరికలు

**-ఆర్టీసీలో ఐక్యపోరాటాల వేదిక ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచండి**

**-నూతన సత్తుపల్లి డిపో కమిటీ కార్మికులందరి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలి**

**-ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రధాన కార్యదర్శి వజ్రాల శ్రీనివాసరావు,ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి ల పిలుపు.**





మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి
ఆర్టీసీ లో ఐక్యత పోరాటం నినాదంతో ఐక్య పోరాటాల వేదికగా ఆవిర్భవించిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ను ఆర్టీసీ కార్మికులందరూ బలపరచాలని,ఎస్ డబ్ల్యూ ఎఫ్ నూతన సత్తుపల్లి డిపో కమిటీ డిపో లోని మొత్తం కార్మికులందరి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని,నూతన డిపో కమిటీకి నూతనంగా డిపోలోని గ్యారేజ్,ట్రాఫిక్ సెక్షన్ లో వివిధ యూనియన్ల నుండి ఫెడరేషన్ లో చేరిన వారికి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు,ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి లు అభినందనలు తెలిపారు.మంగళవారం ఉదయం సత్తుపల్లి లోని కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటైన సత్తుపల్లి డిపో 11వ మహాసభలో డిపో కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ జండా ఆవిష్కరణ చేసి సభకు అధ్యక్షత వహించారు.ఎం.పద్మావతి అతిథులను వేదిక మీదికి ఆహ్వానించారు.జొన్నలగడ్డ జగన్నాథం సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా హాజరైన ప్రతినిధులందరూ మౌన పాటించి నివాళులర్పించారు.మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ఎస్ రావు ప్రసంగిస్తూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ ప్రభుత్వం ఆమోదించినందున విలీనం కంటే ముందే పరిష్కరించాల్సిన సమస్యలను అనేక అధ్యయనాలు చేసి యాజమాన్యం ముందు ఎస్ డబ్ల్యూ ఎఫ్ గా ఉంచడం జరిగిందని,ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత,పని పరిస్థితులు,వేతన ఎరియర్స్,ఎస్ ఆర్ బి ఎస్,ఎస్ బి టి,సిసిఎస్ వంటి సంక్షేమ పథకాలు వైద్య సదుపాయాలు అన్నిటి పై స్పష్టత రావాల్సి ఉందన్నారు.ఆర్టీసీ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అనేక అంశాలు ప్రస్తావిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ లో పనిచేస్తున్న అన్ని కేటగిరి కార్మికుల ఉద్యోగుల సమస్యలను సదస్సులు పెట్టి కేటగిరీల వారీగా సమస్యలను సేకరించి వాటన్నిటి పరిష్కారం కోరుతూ యాజమాన్యం ఉంచుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి నుండి ఆర్టీసీ కార్మికుల సమస్యలను సేకరిస్తున్న ఏకైక సంఘం ఆర్టీసీలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమేనని హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు.కార్మిక సమస్యల పరిష్కారం పట్ల ఎస్డబ్ల్యుఎఫ్ చేస్తున్న కృషి ఆర్టీసీ కార్మికుల ఐక్యత కోసం నికరంగా నిలబడ్డ ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయడం కోసం ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో చేరుతున్న వారందరికీ రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు తెలిపారు.గతంలో ఖమ్మం రీజియన్ లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గుర్తింపు సంఘం గా యాజమాన్యంతో జరిగిన జాయింట్ మీటింగుల్లోనూ పోరాటాల్లోనూ ఖమ్మం రీజియన్ కార్మికుల ఆదరభిమానాలు పొందిందని గుర్తు చేశారు.నూతన సత్తుపల్లి డిపో కమిటీ డిపో లోని మొత్తం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఉద్బోధించారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి ప్రసంగిస్తూ సత్తుపల్లి డిపోలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో భారీ చేరికలు అభినందనీయమని,ఖమ్మం రీజియన్ లో మణుగూరు, ఖమ్మం,సత్తుపల్లి డిపోలో ఎంప్లాయిస్ యూనియన్,తెలంగాణ మజ్దూర్ యూనియన్,నేషనల్ మజ్దూర్ యూనియన్ ల నుండి అనేకమంది డిపో మరియు రీజనల్ స్థాయి నాయకులు ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో చేరుతున్నారని ఇది ఆర్టీసీ కార్మికులు ఐక్య పోరాటాలను బలపరచడానికి నిదర్శనమని పేర్కొన్నారు.గతంలో ఖమ్మం రీజియన్ స్థానిక గుర్తింపు సంఘంగా అన్ని డిపోల్లో మహిళా విశ్రాంతి గదుల ఏర్పాటు,మహిళా కండక్టర్ల కోసం ప్రత్యేక డ్యూటీ చార్టులు ఏర్పాటు చేయించడం,సింగల్ క్రూ డ్యూటీల రద్దు కోసం,డ్రైవర్ల విల్లింగ్ లేకుండా టిమ్ డ్యూటీలకు పంపరాదు అని అనేక పోరాటాలు నిర్వహించిన విషయం పేర్కొన్నారు.ఆర్టీసీలో మూడు రోజుల సమ్మె విజయం ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు నిదర్శనమని ఆర్టీసీ కార్మిక సంఘాలను ఐక్యంగా నిలపడం కోసమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్వతంత్రంగా వ్యవహరించిందని సమ్మెకు ఎస్ డబ్ల్యూ ఎఫ్ మద్దతు ప్రకటించి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన తర్వాతనే మిగతా సంఘాలు కూడా సమ్మెకు మద్దతు ప్రకటించాయని విశదీకరించారు. కొంతమంది నాయకులు కార్మిక ఐక్యతకు వక్రభాష్యం చెబుతూ మావల్లే సమ్మె జయప్రదం అయిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఆర్టీసీ కార్మికులు వాస్తవాలు తెలుసుకున్నారని ఎస్డబ్ల్యుఎఫ్ లో చేరికలే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.నూతన సత్తుపల్లి డిపో కమిటీకి రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు తెలిపారు. డిపో కార్యదర్శి చింతలచెరువు వెంకట కృష్ణారెడ్డి కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ డిపోలోని గత కార్యకలాపాలను ప్రస్తావించారు. యూనియన్ అభివృద్ధి కోసం నూతన కమిటీ కృషి చేయాలని కోరారు. రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ లు మాట్లాడుతూ అత్యంత జయప్రదంగా ఎస్డబ్ల్యుఎఫ్ సత్తుపల్లి డిపో మహాసభ జరిగిందని,గ్యారేజ్ నుండి పూర్తి స్థాయిలో ఎస్డబ్ల్యుఎఫ్ లో చేరటం అభినందనీయమని,నూతన ఉత్సాహంతో నూతన కమిటీ డిపో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని,కార్మికులందరికీ అందుబాటులో ఉంటూ పని చేయాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వేము జాకబ్ ప్రసంగించిన ఈ కార్యక్రమంలో రీజియన్ సహాయ కార్యదర్శి ఏ.పద్మావతి,రీజియన్ ఉపాధ్యక్షులు శంకర్ రైతు సంఘం సత్యనారాయణ నాయకులు సిఐటియు డివిజన్ నాయకులు పాండురంగారావు ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు గ్యారేజ్ కాంతారావు, సైదిరెడ్డి, రాంబాబు, ఎడిసి ప్రసాద్, సాయిరాం ,శబానాబేగం ,వరలక్ష్మి,మంజు ,రేణుక, సత్యనారాయణ ,ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.మహాసభలో కృష్ణవేణి ఆలపించిన అభ్యుదయ గీతాలకు కరతాళ ధ్వనులతో అభినందించారు.

**ఎస్ డబ్ల్యూ ఎఫ్ నూతన సత్తుపల్లి డిపో కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

11వ సత్తుపల్లి డిపో ఎస్ డబ్ల్యూ ఎఫ్ మహాసభలో నూతన అధ్యక్షులుగా ఎస్.వసంతరావు కార్యదర్శిగా ఎన్.దొరబాబు,మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గా ఏ.పద్మావతి గా ప్రచార కార్యదర్శి గా జె.వెంకటయ్య కోశాధికారి గా ప్రభాకర్ తో మొత్తం 25 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనది.నూతనంగా ఎన్నికైన కమిటీకి ఆర్టీసీ అధికారులు, సూపర్వైజర్లు కార్మిక సమస్యల పరిష్కారంలో సహకరించాలని రీజయన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు పిట్టల సుధాకర్ లు విజ్ఞప్తి చేశారు.

## సేవ్ మణుగూరు ఉద్యమానికి మాజీ ఉద్యోగుల సంఘీభావం

**- డిప్‌సైడ్,ఎక్స్‌టెన్షన్ సింగరేణికే దక్కాలి: కురి రాజేశ్వరరావు**

మణుగూరు,జూన్ 23( మీడియా టుడే):
ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'సేవ్ మణుగూరు' నిరాహార దీక్షల శిబిరాన్ని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ నాయకుడు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కురి రాజేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపారమైన బొగ్గు నిల్వలు





కలిగిన మణుగూరు కేంద్ర, రాష్ట్ర రాజకీయాలకు బలిపశువుగా మారడం దురదృష్టకరమన్నారు. జాతీయ బొగ్గు గనుల వేలంపాటలో పీకేఓసీ డిప్‌సైడ్ ఎక్స్‌టెన్షన్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 170 యాక్ట్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ప్రైవేటీకరణకు తావు లేదన్నారు.సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని, అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా పబ్లిక్ సెక్టార్ సంస్థగా కొనసాగుతోందని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.

# మిలియన్ మార్చ్ సకలజనుల సమ్మేళనం

మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23



మిలియన్ మార్చ్,సకల జనుల సమ్మెను తలపించే విదంగా ఉప్పల్ బగాయత్ లో జూన్ 2 జరిగే భూ పోరాటం కు మెదక్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఉమ్మడి మెదక్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు వేముల భవాని పిలుపునిచ్చారు.. ఈ సందర్భంగా మెదక్ లో టిఆర్ఎస్ పార్టీ నాయకులతో టీఎన్జీవో భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు..

# తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలు ఆకాంక్షలను సాధించుకునే విధంగా టిఆర్ఎస్ పార్టీ కృషి

మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23

తెలంగాణ ఉద్యమకారుల ఆశయాలు ఆకాంక్షలను సాధించుకునే విధంగా టిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందన్నారు.. తెలంగాణ ఉద్యమంలో కష్టపడ్డ ఉద్యమకారులను గత ప్రభుత్వం ప్రస్తుతమున్న ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.. తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమ కారులను దృష్టిలో పెట్టుకొని టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్ని వర్గాల వారికి న్యాయం చేయడం కోసం. ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది అన్నారు... ప్రతి సమస్య మీద టిఆర్ఎస్ పార్టీ అదినేత్రి ప్రశ్నించడం, సాధించడం ఆమె తత్వమన్నారు.. టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన మొదటి నుంచి ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇస్తామని టిఆర్ఎస్ పార్టీ అధినేత్రి చెప్పడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఉద్యమకారులకు ప్రార్థన చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.. తెలంగాణ రాష్ట్రనికి మొదటి మహిళ ముఖ్యమంత్రి కవిత అవుతుందని దిమా వ్యక్తం చేశారు.

# ఓటర్ ప్రత్యేక సవరణ కార్యక్రమం 2026 అవగాహన పొందేందుకు 2కే రన్ ఏర్పాటు

## జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి
మీడియా టుడే జూన్ 23



ప్రత్యేక సవరణ కార్యక్రమం 2026లో భాగంగా ఓటరు అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమాల కింద 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 24.06.2026న ఉదయం 07:30 గంటలకు ఇల్లందు క్లబ్ హౌస్, మంజూర్ నగర్ నుండి ఐడిఓసి కార్యాలయం వరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడం,ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగానిర్వహించేందుకు వివిధ శాఖల జిల్లా అధికారులకు బాధ్యతలు కేటాయించినట్లు ఆయన తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులను నిర్వర్తించి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన సూచించారు.జిల్లాలోని యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

# శాయంపేట రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి/శాయంపేట మీడియా టుడే జూన్23



శాయంపేట మండల రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రైతులు సన్న వడ్ల బోనస్‌కు అర్హత కలిగిన 8 రకాల వరి విత్తనాలను సాగు చేయాలని సూచించారు. అలాగే మొక్కజొన్న అధికంగా సాగు అవుతున్న నేపథ్యంలో ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పత్తి, మిరప, కందులు, పెసలు వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందని, త్వరలో రైతుబంధు సాయం కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్,మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

## - ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యుల

కుబీర్ జూన్ 23 మీడియా టుడే జిల్లా ప్రతినిధి:



హంపోలీ (బి) గ్రామానికి చెందిన జాదవ్ రాహుల్ కుమారుడు జాదవ్ అవినాష్ ఈ నెల 21న తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు,దంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బంధువులు, స్నేహితుల వద్ద గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు.దీంతో కుటుంబ సభ్యులు కుబీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేసి బాలుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.బాలుడు ఆచూకీ తెలిసిన వారు వెంటనే కుటుంబ సభ్యులకు లేదా ఎస్సై కు 8712659537 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని ఎస్సై అన్నారు.

# చేనేత సహకార సంఘం చైర్మన్ ను ఘనంగా సన్మానించిన సర్పంచ్ పావని నరేందర్ గౌడ్



మెదక్ జిల్లా మీడియా టుడే జూన్23:

మెదక్ మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘంకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులుకొడుపాక విట్టల్, ఉపాధ్యక్షులు పల్లె సంగ మేశ్వర్,పాలక వర్గం డైరెక్టర్లను మంగళవారం రోజు పాపన్నపేట్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్ శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల పద్మశాలి అధ్యక్షులు వళ్ళందేశి శ్రీనివాస్,సుంకరి శివయ్య,టప్పు రాములు, క్యాసగల ప్రవీణ్ గౌడ్, ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పై లైంగిక దాడి, హత్యాయత్నం చేసిన

# గౌస్‌ను ఉరి తీయాలని ఖమ్మంలో నిరసన ర్యాలీ



**ఖమ్మం జూన్ 23.** మైనర్ బాలిక పై లైంగిక దాడి, హత్యాయత్నం చేసిన గౌస్ పాషా ను తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి ఉరి తీయాలనీ కోరుతూ, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని. ప్రభుత్వ పథకాలు అందజేయాలనీ కోరుతూ రజక సంఘాలు, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బురహాన్ పురం జెండాల సెంటర్ నుండి పెవిలియన్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్ జక్కుల లక్ష్మయ్య, మాజీ కార్పొరేటర్లు బుడిగం శ్రీనివాసరావు, బుర్రి వెంకట్, నాయకులు ఆకుల గాంధీ, బహుజన సంఘాల జిల్లా నాయకులు కత్తి నెహ్రూ గౌడ్, బోడా వీరన్న, మాజీ కౌన్సిలర్ పువ్వాడ పార్థసారధి, మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నాగేందర్, ఉద్యమ కారుల సంఘం నాయకులు డాక్టర్ కె వి. కృష్ణారావు, లింగనబోయిన సతీష్, రేగళ్ల సీతారాములు, గుండ్లపల్లి శేషు, గోరంట్ల రవి, బానోత్ భద్రు నాయక్, జక్కుల వెంకటరమణ, రేగళ్ల కొండలు, బాసాటి హనుమంతరావు, రేగముడి రామకృష్ణ, కంద్రాతి వెంకన్న, దాసరి మధు లు మాట్లాడుతూ గౌస్ ను వెంకనే ఉరి తీయాలనీ, బాధిత కుటంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసారు. ఈ ర్యాలీ లో గౌస్ పాషా కి ఉరిశిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వాలని, కార్పొరేట్ వైద్యం అందించాలని ఎత్తున నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు నాయకులు మన్నే వెంకటరమణ, 50వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరెడ్డి రమేష్, పేరెల్లి విజయ్ కుమార్, గొట్టేపర్తి శ్రీనివాస్,రజక సంఘం నాయకులు రేగళ్ల కొండలు, తెనాలి వీరబాబు,గోలి రామారావు, గోనేల శివ, బోనగిరి ఉపేందర్, పగిల్ల బుచ్చిబాబు,గోనెల రవిశంకర్, పిల్లుట్ల కృష్ణ, జక్కుల శ్రీనివాస్, కొలిపాక వెంకట్,వట్టేకోటి అప్పారావు, వట్టేకోటి వెంకన్న, జక్కుల పద్మ, జక్కుల మౌనిక, మాధురి, శిరీష, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హన్వాడలో విత్తన మేళా ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## నాణ్యమైన విత్తనాలే వినియోగించాలి.. నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు

మహబూబ్నగర్ మీడియా టుడే ప్రతినిధి:



రైతులు నాణ్యమైన, ధృవీకరించబడిన (సర్టిఫైడ్) విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. నకిలీ విత్తనాలు, గడువు తేదీ ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.హన్వాడ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో రైతు ముంగిట్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలలో విత్తన మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన పంట విత్తనాలు, పప్పు దినుసుల విత్తనాలు, నూనె గింజల విత్తనాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను ప్రదర్శించి రైతులకు అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు.రైతులు యూరియా ను మోతాదు కు మించి వాడకుండా నేల ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన వ్యవసాయ విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు రైతుల ఖర్చులను తగ్గించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. పి.ఏ.సి.ఎస్.ల (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు) ద్వారా కూడా ఎంపిక చేసిన రైతు వేదికల వద్దే ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో రైతులు గ్రామ స్థాయిలోనే విత్తనాలు, ఎరువులు పొందగలరని, సమయం, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు.అనంతరం కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, శాస్త్రీయ సూచనలు, వ్యాధి నివారణ చర్యలపై ఉద్యాన శాఖ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కూరగాయల సాగుపై రైతులు అవగాహన పెంచుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్,జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్,జిల్లా సహకార అధికారి కృష్ణ,తహశీల్దార్ కిష్టా నాయక్, ఎం.పి.డి. ఓ యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు

# రైతు వేదికలో ఘనంగా విత్తన మేళా

## - రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు,జూన్ 23( మీడియా టుడే):**



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు వేదికలో విత్తన మేళా" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల వరి వంగడాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. సహజ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ అవసరం, పచ్చిరొట్ట ఎరువు పంటల సాగు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు.అనంతరం మండలంలోని ఇన్‌పుట్ డీలర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించి, రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలు, ఎరువుల గురించి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు, మండల వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ లక్ష్మణరావు, గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజిత, లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్, సమితిసింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, దేవస్థానం చైర్మన్ కూచిపూడి బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, దొబ్బల వెంకటప్పయ్య, పోలామూరి రాజు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఇన్‌పుట్ డీలర్లు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ విత్తన మేళా ద్వారా రైతులు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ సూచనలపై సమగ్ర అవగాహన పొందారని తెలిపారు.

# రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళాల ప్రారంభం





**మెదక్ జిల్లా మీడియా టుడే జూన్ 23**

రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతు నేస్తం' కార్యక్రమమం ద్వారా మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా అధికారికంగా ప్రారంభించారు.".ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో విస్తృతంగా చర్చించిన అనంతరం ఎంపిక చేసిన ఏడు సన్న వరి రకాలకు ప్రోత్సాహకంగా బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి విత్తనాలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా ఈ మేళాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని రైతు వేదికల్లో నిర్వహించే ఈ విత్తన మేళాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాల విక్రయంతో పాటు వాటి సాగు పద్ధతులు, పంట యాజమాన్యం, అధిక దిగుబడుల సాధనకు సంబంధించిన సాంకేతిక సూచనలను కూడా అందించనున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యక్షంగా మార్గనిర్దేశం చేయనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ మేళాల కోసం 1,24,649 క్వింటాళ్ల వరి విత్తనాలు, 6,913 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు సిద్ధం చేశారు. అదనంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ , "నర్సంపేట శాసనసభ్యులు మాధవ రెడ్డి , పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి , తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించబడు కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంతో పాటు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని మంత్రులు పిలుపునిచ్చారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**అంగవైకల్యం నిర్మూలనే లక్ష్యంగా పోలియో చుక్కలు.**

**డాక్టర్ .బల్వీర్ సింగ్ వైద్యాధికారి**

**గజ్వేల్ జూన్ 23(మీడియా టు డే )**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐఓసీ ఆఫీస్ సముదాయంలో మంగళవారం రోజు హెల్త్ సిబ్బందికి ఆశా కార్యకర్తలకు అంగన్వాడి టీచర్లకు పోలియో పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఆదివారం తేదీ:28 06 .26 రోజున అన్ని గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలియో కేంద్రాల వద్ద ఐదు సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ నందు ప్రజ్ఞాపూర్ గజ్వేల్ బస్టాండ్ యందు కేంద్రాలు ఏర్పాటు చేయబడిన అన్నారు. నిండు జీవితానికి రెండు చుక్కలు చాలు అని తల్లిదండ్రులకు ఎంత పని ఉన్నా ఆరోజు మీ పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో సోకిన వ్యక్తి కుంటి



కాలు కుంటి చేయి తో అంగవైకల్యంతో జీవితాంతము బాధపడాల్సి ఉంటుందని కాళ్లు చేతులు చచ్చుబడిపోతాయని పిల్లల్లో అంగవైకల్యం వచ్చి పక్షవాతం కి దారితీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సిహెచ్ఓ ఎస్ యాదగిరిరావు. ఆరోగ్య కేంద్రం సి. హెచ్ .ఓ. కాశీం క్లస్టర్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్. సురేందర్ ఎం.పీ. హెచ్ .ఈ .ఓ స్థానిక సూపర్వైజర్ అనిత, అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి. వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు,వాలంటీర్లు, యువజన సంఘ సభ్యులు మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన - అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర జూన్ 23



భూభారతి, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన భూభారతి, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కు సూచించారు.

## చూపు కోల్పోయిన సూచక బోర్డు

### ఆనవాళ్లు లేని సూచిక బోర్డు అయోమయంలో వాహనదారులు

మీడియా టుడే ఎర్రుపాలెం:



గ్రామాల సమీపిస్తున్న తరుణంలో ఊరును తెలిపే సూచిక బోర్డులను అనుసరించి వాహనదారులు తమ ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. అలాంటిది ఎర్రుపాలెం మండలం పెద్ద గోపవరం సమీపంలో సూచిక బోర్డు ఆనవాళ్లు కోల్పోయి దిక్కు దిశ లేక ఆనవాళ్లను కోల్పోయి వాహనదారులకు ఏ ఊరో తెలియక అయోమయంలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా సూచిక బోర్డు ఆనవాళ్లు కోల్పోయి ధ్వంసమై ఉన్న సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వాహనదారులు వాపోతున్నారు. కొత్త ప్రాంతం వారు ఆ మార్గం గుండా ప్రయాణించేటప్పుడు సూచిక బోర్డు ధ్వంసం అవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు చొరవ తీసుకొని సూచిక బోర్డ్ ను పునరుద్ధరించి వాహన దారుల అవస్థలను గమనించి త్వరతిగతిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు

## వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు రైతులు పాటించాలి : సర్పంచ్ శ్రీనివాస్

నడిగూడెం, జూన్ 23(మీడియా టుడే)-:



వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను రైతులు తప్పక పాటించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని నడిగూడెం, సిరిపురం గ్రామాలలోని రైతు వేదికల నందు తెలంగాణ ప్రజా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న విత్తన మేళాను నడిగూడెం రైతు వేదిక నందు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమ ధ్యేయంగా భూసార పరీక్షలు నిర్వహిస్తూ దానికి అనుకూలంగా పంట మార్పిడి చేయాలని కోరుతూ విత్తనాలపై ప్రత్యేక చొరవచూపుతూ ప్రచారం చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న. 7 రకాల సన్న విత్తనాలను సాగు చేసి బోనస్ ను పొందాలని కోరారు. నానో డీఏపీ ,నానో యూరియా వాడడం వలన రైతులు వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలియజేశారు అలాగే పొలంలో పచ్చి రొట్టె ఎరువులు వేసుకొని భూసారని పెంచుకోవాలని సూచనలు ఇచ్చారు కార్యక్రమంలో ఏక్లాస్ ఖాన్ పేట సర్పంచ్ నరసింహారావు,ఏవో మల్సూర్,హెచ్ ఓ అనిత,ఏఈఓ వెంకటరెడ్డి,రైతులు పందిరి వెంకటరెడ్డి, యలక సంజీవరెడ్డి, బోళ్ల సీతారామరెడ్డి,గుండు పాపయ్య, రౌతు ఉపేందర్బీరవల్లి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగంపై అవగాహన కల్పించిన ఎస్సై సుప్రియ

భైంసా జూన్ 23 మీడియా టుడే జిల్లా ప్రతినిధి:



భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై మాటేగాం .వానాల్పాహడ్ .గ్రామలలో అవగాహన కార్యక్రమాన్ని నీర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. గంజాయి అలవాటు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి

### టి యు సి ఐ రాష్ట్ర ఉప అధ్యక్షుడు వెంకన్న వెల్లడి

మీడియా టుడే.




నిజామాబాద్.23 (అర్బన్ ) గ్రామపంచాయతీ కార్మికులకు ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలు అమలు చేయాలని ఇతర సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలోని 12732 గ్రామపంచాయతీల్లో సుమారు 60వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. జీపీ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. పెరుగుతున్న ధరలతో కార్మికుల కుటుంబాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కనీస వేతనాల జీవో నెంబర్ 06 ప్రకారం వేచనాలు పెంచి ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. జనాభా ప్రాతిపదికన ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన కార్మికులకు ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వేతనాలు పెంచకుంటే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం నరేందర్, ఎం సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లేష్ జిల్లా నాయకులు మురళి, సాయరెడ్డి లక్ష్మణ్, గంగాధర్, జీపీ కార్మికులు సాయిలు, మహేందర్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోండి

### ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు- ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు డ్రగ్స్‌పై అవగాహన.



అశ్వారావుపేట ప్రతినిది మధు,జూన్23 (మీడియా టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణం ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణంలో ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు, యువకులు చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా బస్ స్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు, యువతకు కరపత్రాలు పంపిణీ చేసి డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి", "మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే నినాదాలతో అవగాహన కల్పించారు.డ్రగ్స్ విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీసు శాఖ ప్రజలతో కలిసి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

## ప్రహరీ గోడ కూలి గాయపడిన కూలీకి అండగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేర్లింగంపల్లి మీడియా టుడే న్యూస్ జూన్ 23



పటాన్చేరు నియోజకవర్గం ఇంద్రేషంలోని త్రివేణి టాలెంట్ స్కూల్ లో నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం ప్రహరీగోడ కూలి శేరిలింగంపల్లి డివిజన్ లోని దూబే కాలనీలో నివాసం ఉంటున్న చెన్నకేశవులు అనే కూలీ పై పడింది. ప్రమాదంలో చెన్నకేశవులు తీవ్రంగా గాయపడ్డారు.విషయం తెలుసుకున్న వెంటనే శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ బాధితుని నివాసంకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.మానవతా దృక్పథంతో స్పందించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కలిసి నష్టపరిహారంగా 8 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధితుడు చెన్నకేశవులు కు చెక్ రూపంలో అందజేసి.. వైద్య ఖర్చులకు తాము అన్ని విధాలా అండగా నిలుస్తామని తెలిపారు. "కష్టంలో ఉన్న ప్రతి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవడం మా బాధ్యత అని ప్రజల సంక్షేమే మా ప్రథమ ప్రాధాన్యత" అని అన్నారు.బాధితుని కుటుంబం గౌరవ కార్పొరేటర్ల సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప్పరి సంఘం అధ్యక్షులు శేఖర్ సాగర్, శేరిలింగంపల్లి ఉప్పరి సంఘం అధ్యక్షులు వెంకటేష్, శేరిలింగంపల్లి సగర సంఘం సభ్యులు బాధితుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకఅవసరాలపిల్లలకిభవిత కేంద్రాలువరంలాంటివి

### నేలకొండపల్లిమండలఅభివృద్ధి అధికారి ఎర్రయ్య

నేలకొండపల్లిజూన్23మీడియా టుడే



తెలంగాణరాష్ట్రంలోస ˇమగ్రశిక్షవిభాగంఆధ్వర్యంలోన దుస్తున్నభవితకేంద్రంప్రత్యేకఅవసరాలుగలపిల్లలకుఒకవరం లాంటివని నేలకొండపల్లి మండల అభివృద్ధి అధికారి ఎర్రయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాజేశ్వర పురం ఎంపీపీఎస్ భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు.భవిత కేంద్రంలో ఉన్న శారీరక, మానసిక, దివ్యాంగులకుప్రత్యేక ఉపకరణాలను ఆయనఅందజేశారు .నేలకొండపల్లి మండలంలో ఉన్న భవిత కేంద్రంలోపిల్లలకు ట్రైసైకిళ్లు,వీల్చైర్లు.చైం ˆ.సిపిచైర్స్. రోలర్స్. నుపిల్లలకు అందించారు. మండల తాసిల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ భవిత కేంద్రాలు కేవలంచదువు చెప్పే పాఠశాలలు మాత్రమేకాదని .అవిపిల్లలసర్వతోముఖాభివృద్ధికితోడ్పడేనరావాసకేంద్రమన్నారుప్రత్యేకఉపాధ్యాయులప ర్యవేక్షణ ,ప్రత్యేకవిద్యావనరుల శిక్షణ పొందినఐ.ఈ.ఆర్.పి. ,ప్రత్యేకఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని చెప్పారు.అవిపిల్లలమానసిక ˇ,శారీరకస్థితినిబట్టిప్ర త్యేకబోధనాపద్ధతుల ద్వారాశిక్షణఇస్తారనిఆయనచెప్పారు మండల విద్యాశాఖ అధికారి చలపతిరావు మాట్లాడుతూభ ̆వితకేంద్రంలోవారానికి ̆రెండురోజులుపిజియోథెరఫి సేవలు ఉచితంగాఅందిస్తారని. ఐ ఈ ఆర్ పిలు స్పీచ్ థెరఫి సేవలు అందిస్తారని ఆయన చెప్పారు.కాంప్లెక్స్ హెచ్ఎం పి కృష్ణారావు మండలంలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగాఉపకరణాలుఅందిస్తారని.భవిత కేంద్రంలో నమోదు ఐన పిల్లలకు ప్రభుత్వం పలు రకాలఅలవెన్సులనుఅందిస్తున్నదని చెప్పారు.

## కొడకండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో12 ఐరన్ రాక్స్ మరియు వాటర్ డిస్పెన్సర్ అందించిన గ్రీన్కో సంస్థ

జనగామ జిల్లా కొడకండ్ల మీడియా టుడే జూన్23:



కొడకండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యశాలలో మంగళవారం రోజు గ్రీన్కో సంస్థ, జిలేష్ సోలార్ పవర్ ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో గ్రీన్కో ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రాథమిక వైద్యశాలకు రోగులకు ఇచ్చే మందులను నిల్వ చేయడానికి, త్రాగునీటి కోసం 42000 వేల రూపాయల విలువైన12 ఐరన్ రాక్స్ మరియు బ్లూ స్టార్ డిస్పెన్సరీలను డా. హరికృష్ణ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్కో యాజమాన్యం, మురళి, బో యిని నరేష్, అఖిల్,సురేంద్ర, నాగు, సాయి తేజ, యాదగిరి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు(ఎం)లో ఆల్ ఇండియా తపాలా ఉద్యోగుల ధర్నా

మీడియా టుడే, జూన్23/ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి:



ఆల్ ఇండియా తపాలా ఉద్యోగుల యూనియన్ నల్లగొండ డివిజన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు సబ్ పోస్ట్ ఆఫీసు వద్ద మొదటి రోజు ధర్నా కార్యక్రమం చేపట్టటం జరిగింది. గ్రామీణ తపాలా ఉద్యోగులు రెగ్యులరైస్ చేయాలని మరియు 8వ కేంద్ర వేతన సంఘం పరిధిలోకి తీసుకొని గ్రామీణ తపాలా ఉద్యోగుల(జీడీఎస్) సమస్యలను తీర్చాలని, డిపార్ట్మెంట్ ఉద్యోగులతో సమానమైన ప్రయోజనాలతో గ్రామీణ తపాలా ఉద్యోగుల (జీడీఎస్) సర్వీసులను క్రమబద్ధీకరించాలని,పాత పెన్షన్ పథకం సుప్రీమ్ కోర్టు సూత్రాల ప్రకారం 01.01.2004 కి ముందు చేసిన జీడీఎస్ సర్వీసును పాత పెన్షన్ పథకం కింద పెన్షన్ ప్రయోజనాల కోసం లెక్కించాలనీ,గ్రూప్ ఇన్సూరెన్స్ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 10 లక్షల బీమా కవరేజ్ తో గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ,3 ఆర్థిక అప్గ్రేషన్లు రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే ఎంఏసిపి పథకంతో సమానంగా 12,24,36 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన జీడీఎస్ అందరికీ డిఎ అలవేన్స్ తో కూడిన 3 ఆర్థిక అప్ గ్రేడెషన్ లు మంజూరు చేయాలనీ, జీడీఎస్ ఉద్యోగులకు టార్గెట్ వేదింపులను డిపార్ట్మెంట్ ఆపాలనీ, జీడీఎస్ ఉద్యోగులందరికీ ఓఎంఏ మరియు హెచ్ఆర్ఏ 500 నుండి 3200 లకు పెంచాలనీ ధర్నా చేశారు..ఈ ధర్నా కార్యక్రమంలో ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల నల్గొండ డివిజన్ అధ్యక్షులు మేడి అంజయ్య, నల్గొండ డివిజన్ సలహాదారులు పోలిశెట్టి నర్సయ్య, పొనగాని జహంగీర్,అల్లం సురేష్, మేడే యాకుబ్, పట్టూరి మణికంఠ, బందెల దేవదాసు, నాగ లోకేష్ రెడ్డి, మతీన్, ఎలిమినేటి శ్రీను,బానోతు బ్రహ్మం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలి

### -సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

మీడియా టుడే యాదాద్రి భువనగిరి జూన్ 23:



మిషన్ భగీరథ పథకంలో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు 26 వేలు పెంచాలని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు.మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నూతన యస్ ఈ రవికిరణ్ కి మరియు మేఘా కంపెనీ ఇంచార్జ్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సి ఐ టి యు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ,పెరిగిన ధరలకు అనుగుణంగా మిషన్ భగీరథ కార్మికుల కనీస వేతనాలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, గత పదేళ్లుగా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు తాగునీరు అందిస్తున్న కార్మికుల జీతాలు నేటికీ రూ.10,000 దాటకపోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు కనీస రక్షణ కరువైందని,తక్షణమే సేఫ్టీ మేజర్స్‌ను అందించాలని డిమాండ్ చేశారు.పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26,000/- ఇవ్వాలనీ,రాత్రి వేళల్లో విధులు నిర్వహించే కార్మికులకు తక్షణమే టార్చ్ లైట్లు, షూస్ సరఫరా చేయాలనీ,కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలనీ కోరారు.?8 గంటల పని విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలనీ,పండుగ సెలవులు,వారంతపు సెలవులు కల్పించాలనీ,విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగితే ఆదుకునేలా రూ 20 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని కల్లూరి మల్లేశం హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సి హెచ్ శ్రీను,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్, నాయకులు సిద్దయ్య,సంపత్ కుమార్, జంగయ్య, ఉపేందర్,మహేష్, జంగయ్య,కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గణపురం రైతు వేదికలో విత్తన మేళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి దేశబోయిన ఐలయ్య

భూపాలపల్లి/గణపురం మీడియా టుడే జూన్ 23




గణపురం మండల కేంద్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంగా విత్తన మేళా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం జూన్23.2026 నుండి జూన్ 30.2026 వరకు రైతు వేదికలో జరుగనుంది.ఈ విత్తన మేళాలో ప్రభుత్వం సిఫార్సు చేసిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉండటంతో పాటు, వివిధ పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు కూడా రైతులకు విక్రయించబడతాయి. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే సౌకర్యం కల్పించబడింది.అలాగే, పంటల దిగుబడులను పెంచేందుకు ఉపయోగపడే నానో ఎరువులు కూడా రైతు వేదికలో అందుబాటులో ఉంచబడతాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు అవసరమైన విత్తనాలు, నానో ఎరువులను కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.కావున గణపురం మండలంలోని రైతులు అందరూ విత్తన మేళాలో పాల్గొని ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమం లో భాగంగా ఈ రోజు రైతు వేదిక యందు విత్తన మేలా కార్యక్రమం లో రైతులు సన్న వడ్లను కొనుగోలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణపురం మండల వ్యసాయాధికారి విస్తరణ అధికారి , సహకార సంఘం సీఈఓ రైతులు పాల్గొనడం జరిగింది.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

### ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోండి: ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు

### ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు డ్రగ్స్‌పై అవగాహన

అశ్వారావుపేట ప్రతినిది మధు,జూన్23 (మీడియా టుడే):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణం ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణంలో ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు, యువకులు చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా బస్ స్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు, యువతకు కరపత్రాలు పంపిణీ చేసి డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి", "మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే నినాదాలతో అవగాహన కల్పించారు.డ్రగ్స్ విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీసు శాఖ ప్రజలతో కలిసి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

## గోదాం నిర్మాణం కోసం 30 లక్షల ప్రొసీడింగ్స్ కాపీ అందజేసిన విఠల్ రెడ్డి

**తానూర్ జూన్ 23 మీడియా టుడే జిల్లా ప్రతినిధి:**



మొగిలి గ్రామానికి చెందిన రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని భైంసా మండలం దేగాం గ్రామంలో విఠల్ రెడ్డి నివాసం వద్ద మొగిలి గ్రామానికి చెందిన గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పంటలను నిల్వ ఉంచేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గోదాం నిర్మాణం పూర్తయిన అనంతరం రైతులు తమ పంటలను భద్రంగా నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతు సంఘాల నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

**- పేటలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

**అశ్వారావుపేట ప్రతినిది మధు,జూన్23 (మీడియా టుడే):**



అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన, నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ పర్యవేక్షణలో పార్టీ సభ్యత్వ నమోదు, ఓటరు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టి.హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, పంట బీమా, రైతు భరోసా అమలులో రైతులను మోసం చేసిందన్నారు. యాసంగి రైతుబంధు, బోనస్ చెల్లింపుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు, పెద్దవాగు నష్టాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులను విడుదల చేయలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తోందని, కార్యకర్తలు కష్టపడి కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్

**మహబూబ్‌నగర్. జూన్ 23(మీడియా టుడే):-**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ఏడో తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రాయిస్ ఫాతిమా ఓ ప్రకటనలో తెలిపారు ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్ తో నేరుగా అడ్మిషన్ పొందవచ్చునని వారు తెలిపారు.0

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**విద్యార్థుల భవిష్యత్తు బాగుపడాలంటే తల్లిదండ్రులు వారి పిల్లలపై శ్రద్ధ పెట్టాలి..**

**పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనించాలి..**

**అనుమానాస్పద కార్యక్రమాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి..**

**మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగానే కాకుండా కుటుంబ పరంగా కూడా ఇబ్బందులు ఎదురవుతాయి..**

**జగిత్యాల మీడియా టుడే- జూన్ 23**




జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. సుధాకర్ , , జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన నష్టాలు, విద్యా భవిష్యత్తుపై వాటి ప్రభావం, కుటుంబ మరియు సామాజిక జీవితంపై ఏర్పడే దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి స్నేహితుల సాంగత్యంలో ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత తమ లక్ష్యాల సాధనకు కృషి చేస్తూ, సమాజానికి ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి స్నేహితుల వర్గం, రోజువారీ కార్యకలాపాలు మరియు ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలు చెడు అలవాట్లు మరియు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మరియు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## బడంపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

**- పరిగి డిపో మేనేజర్‌కు వినతి**

**విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉదయం బస్సు ఏర్పాటు చేయాలని బడంపల్లి నరేష్ విజ్ఞప్తి**

**పరిగి మీడియా టుడే జూన్ 23:-**



దోమ మండలంలోని బడంపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బడంపల్లి నరేష్ సోమవారం పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. బడంపల్లి గ్రామానికి ప్రస్తుతం బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరియు ఇతర విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు రవాణా సౌకర్యం లేక చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లాల్సిన గ్రామస్తులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 8:30 గంటలకు ఒక బస్సును బడంపల్లి గ్రామానికి నడిపేలా చర్యలు తీసుకుంటే బడంపల్లి తండా, కొండయ్యపల్లి, గంజిపల్లి తదితర గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు సౌకర్యం మరియు విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రయాణ అవకాశాలు బస్సు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా, గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించేలా బడంపల్లి గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని పరిగి డిపో మేనేజర్‌ను కోరారు.

# శ్రీ లక్ష్మీ ట్రేడర్స్‌పై చర్యలు తీసుకోవాలి

**ఏఓకు వినతి పత్రం**




**మహబూబ్‌నగర్. జూన్23(మీడియా టుడే):-**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రము లోని రైతు వేదిక ఆవరణలో వినతి పత్రంను మహేందర్ ఏఓకు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ కోరమండల్ గ్రోమోర్ ఎంఆర్ఎఫ్ రేట్ కన్నా 350 రూపాయలు అదనంగా తీసుకుంటున్న శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ పై చర్యలు తీసుకోవాలని అని తెలిపారు 1450 రూపాయలు కంటే 1800 రూపాయలు 350 రూపాయల అదనంగా తీసుకుంటూ రైతులకు మోసం చేస్తున్నారు రసీదు ఇవ్వమని అడగడంతో అన్ని షాపులలో ఇదేవిధంగా అమ్ముతున్నాము కాబట్టి రషీద్ ఇవ్వడం కుదరదని తెలిపినట్టు వారు వాపోయారు. నేను తీసుకున్న ఒక బస్తా అయితే పది బస్తాలు తీసుకున్నట్టు ఆన్లైన్లో అప్లోడ్ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు ఒక షాపులో ఒక్కో రేటు అమ్ముకుంటూ రైతులను నట్టేట్ల ముంచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండల అధికారులు పర్యవేక్షణ లోపమేనని వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వాళ్ళు గ్రామాల రైతులు ఆవిదనం వ్యక్తం చేశారు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అక్రమంగా వ్యవహరిస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ యజమాని లక్ష్మీనారాయణ.ప్రభుత్వం ఈపాస్ లో నిర్వహించిన ధరకే అమ్మినట్లు వారు తెలిపారు.

# సిపిఎంసీనియర్ నాయకుడు పెదపాకవెంకటేశ్వర్లుమృతి

**నివాళులర్పించిన సిపిఎం పార్టీ జిల్లానాయకుడుగుడవర్తినాగేశ్వరరావు**

**నేలకొండపల్లి జూన్ 23 మీడియా టుడే ప్రతినిధి**

నేలకొండపల్లిమండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు పార్టీ మాజీ మండల కమిటీ సభ్యుడు పెదపాక వెంకటేశ్వర్లు(65) మంగళవారం మరణించారు. ఆయన గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదపాక వెంకటేశ్వర్లు ఎర్రజెండా పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా, మండల కమిటీ సభ్యునిగా సుదీర్ఘకాలం పనిచేసి గ్రామంలో పార్టీని అగ్ర భాగాన నిలపడంలో అహర్నిశలు శ్రమించారన్నారు. ఎక్కడ పార్టీ కార్యక్రమం నిర్వహించిన ఉత్సాహంగా పాల్గొంటూ ఎర్రజెండాపై ఎనలేని ప్రేమాభిమానాలను చూపించేవారన్నారు. ఆయన ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తీరని లోటు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే వెంకటేశ్వర్లకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు రచ్చ నరసింహారావు, భూక్య కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, పెదపాక మల్లేశ్వరరావు, షేక్ మహిముద్, ఆదినారాయణ, పసుపులేటి నారాయణ తదితరులు ఉన్నారు.



# అంబేద్కర్ నగర్ హత్య కేసు ఛేదన ప్రధాన నిందితుడు అరెస్ట్

**- హత్యకు ఉపయోగించిన కత్తి, టీషర్టు స్వాధీనం.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,జూన్ 23(మీడియా టుడే):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీలో జరిగిన ఇనగంటి నాగరాజు హత్య కేసును పోలీసులు ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అంబేద్కర్ నగర్‌కు చెందిన సాధన శివాజీ భార్యను అదే గ్రామానికి చెందిన ఇనగంటి నాగరాజు వేధిస్తున్నాడని ఆమె తన భర్తకు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. దీంతో సాధన శివాజీ, అతని భార్య నాగేశ్వరి, చెల్లెలు పరిశుద్ధ అలియాస్ ప్రమీల కలిసి నాగరాజును హత్య చేయాలని పథకం రచించారు. ఈ నెల 21వ తేదీ రాత్రి సుమారు 10.20 గంటలకు నాగరాజు తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో సాధన శివాజీ కత్తితో దాడి చేసి హత్య చేసి పరారైనట్లు తెలిపారు. మంగళవారం నిందితుడు శివాజీ ఇంటికి వచ్చినట్లు సమాచారం అందడంతో వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. కరుణాకర్ తన సిబ్బందితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన శివాజీ వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు ఘటన సమయంలో ధరించిన టీషర్టును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని, మిగతా నిందితుల పాత్రపై కూడా విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. వన్ టౌన్ సీఐ కరుణాకర్, టూ టౌన్ ఎస్ఐలు రాజశేఖర్, జీవన్ రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**భువనగిరిలో జూలై 5న జరగనున్న రాజ్యాధికార సమరభేరి సభను**

# అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయండి

**రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రిక అందజేత"**

**టిఆర్పి జిల్లా అధ్యక్షులు రవి పటేల్**

**భూపాలపల్లి మీడియా టుడే జూన్ 23**

జిల్లాలో రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రికల పంపిణీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, పార్టీ జిల్లా నాయకులతో కలిసి పలువురు బీసీనాయకులు, ఉద్యమకారులకు రాజ్యాధికార సమరభేరి ఆహ్వాన పత్రికలనుఅందజేశారు. ఈ సందర్భంగా పైడిపల్లి రమేష్, భీమనాథుని సత్యనారాయణ, ఖ్యాతం సాంబమూర్తి,లట్ట రాజబాబు,తాటి వెంకన్న, ఖ్యాతం సతీష్ కుమార్ తదితర ప్రముఖ నాయకులకు ఆహ్వాన పత్రికలను అందించారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల పెద్దలు మరియు ముఖ్య బీసీ నాయకులకు కూడా ఆహ్వానపత్రికలనుఅందజేయడం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పెను సామాజిక మార్పు కోసం తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార పోరాటానికి మద్దతుగా అన్ని కుల సంఘాల నాయకులు, ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందని, సామాజికతెలంగాణసాధించాలంటే రాజ్యాధికార దిశగా అందరూ ఐక్యంగా పయనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జూలై 5న భువనగిరిలో జరగనున్న రాజ్యాధికార సమరభేరి సభకు అన్ని కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరవుతామని హామీ ఇచ్చారని తెలిపారు. తమ సంఘాల నాయకులతో చర్చించి సభకు భారీగా తరలివస్తామని చెప్పినందుకు వారికి రవి పటేల్ కృతజ్ఞతలు తెలియజేశారు .అదేవిధంగా రాజ్యాధికార సమరభేరి విజయవంతం కోసం ఈ ఉద్యమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లాలని,టీఆర్పీ పార్టీ నాయకులు,కార్యకర్తలు,శ్రేణులు పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహించాలని రవి పటేల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గండు కరుణాకర్, జింకల శ్రీను,రాజేంద్రచారి,సలీం తదితరులు పాల్గొన్నారు.



## బాసర మహంకాళి ఆలయంలో జరిగిన చోరీ ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



**బాసర జూన్ 23 మీడియా టుడే జిల్లా ప్రతినిధి:**

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం పై అంతస్తులో ఉన్న మహంకాళి ఆలయంలో మంగళవారం రాత్రి అమ్మవారి వెండి కిరీటం, హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి.. అనంతరం హుండీ వ్యాసగుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఘటన జరిగిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ పరిశీలించి, చోరీ జరిగిన పరిస్థితులు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణంలో దర్యాప్తు చేపట్టి, నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిన భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్,సమ్మయ్య, ఎస్ఐ లు ఇతర పోలీసు సిబ్బంది , దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**మహబూబ్‌నగర్. జూన్ 23(మీడియా టుడే):-**

మహబూబ్‌నగర్ జిల్లా మన్సూర్ పల్లి గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ బోనాల పండుగ జరుపుకున్నట్లు సర్పంచ్ నాగేంద్రమ్మ సూర్య ప్రకాష్ తెలిపారు. గ్రామంలోని ప్రజలు అమ్మవారికి ప్రత్యేక మట్టి పాత్రలో నైవేద్యం, పిండి పదార్థాలు చేసుకొని. గ్రామంలోని ఆడపడుచులు నూతన దుస్తులు ధరించి. ప్రత్యేక అలంకరణతో బోనం తయారు చేసుకుని పవిత్రంగా తమ నెత్తిపై బోనం ఎత్తుకొని కోడిపుంజుతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న నైవేద్యం అమ్మవారికి సమర్పించి తమ కోరికలు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు.



## గౌడల జీవనోపాధికి అండగా ఆధునిక పరికరాలు

**వరంగల్ జిల్లా బ్యూరో జూన్ 23 ,మీడియా టుడే.**



ఖానాపూర్ మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో గౌడ కులస్తుల జీవనోపాధి అభివృద్ధికి కీలకమైన మల్టీ ట్రీ క్లైంబింగ్ మెషిన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తాటి, ఈత చెట్లను సురక్షితంగా అధిరోహించేందుకు ఉపయోగపడే ఈ ఆధునిక పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు నర్సంపేట ఎఫ్ఆర్ఓ బి నరేష్ అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయడం ద్వారా కార్మికుల శ్రమను తగ్గించడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. చెట్లెక్కే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఈ మెషిన్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో (ఎఫ్ఆర్ఓ) నరేష్ బి.అటవీ అధికారి రీనా కుతాటి, అటవీ పరిధి అధికారి, ఎన్జీవో ప్రతినిధి రాహుల్ ప్రకాష్, వీఎస్ఎస్ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అశోక్‌నగర్ గ్రామ సర్పంచ్ జాడి అచ్యుత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్ది శ్రీనివాస్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టి సారంగం, బండి వెంకన్న తదితర ప్రజాప్రతినిధులు హాజరై లబ్ధిదారులకు అందజేసి అభినందించారు.పెద్ద సంఖ్యలో గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ వృత్తిదారుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## కేజీబీవీ నీ పరిశీలించిన.. జి సి డి ఓ

**మీడియా టుడే ఎర్రుపాలెం:**



ఎర్రుపాలెం మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జి సి డి ఓ రూబీ పంకజం తనిఖీ చేశారు. పాఠశాల ప్రారంభమైన సందర్భంగా ఎస్ ఓ తో కలిసి పరిసరాలను కలయ తిరిగి వాతావరణ పరిస్థితులను గమనించారు. అనంతరం దస్త్రాలను తనిఖీ చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సదుపాయాలు అందుతున్నాయో లేదని విద్యార్థులను అడిగి తెలుసుకొని శ్రద్ధతో చదివి ఉన్నతమైన స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని విద్య బోధన విషయంలో నిర్లక్ష్యం తగదని ఎస్ ఓ సరితకు సూచించారు.అనంతరం వంట శాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. పనులను త్వరతెగతిన పూర్తి చేయాలని గుత్తేదార్ కు తెలపాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయునీయులు, సిబ్బంది పాల్గొన్నారు

## గంజాయి, సైబర్ నేరాల పేకాట కార్డన్ సెర్చ్ ఆన్‌లైన్ గేమ్స్ వంటి అసంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ మల్లేష్ యాదవ్




**భూపాలపల్లి/మొగుళ్లపల్లి మీడియా టుడే జూన్ 23**

మొగుళ్లపల్లి మండలం బంగ్లాపల్లి గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో, స్థానిక ఎస్సై ముప్పు సురేష్ తన సిబ్బందితో కలిసిమంగళవారంతెల్లవారుజామున గ్రామాన్ని చుట్టుముట్టి ఇంటింటి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తులు, గ్రామానికి కొత్తగా వచ్చిన వారి వివరాలను సేకరించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు.అనంతరం గ్రామస్థులతో సమావేశమైన సీఐ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, గంజాయి, సైబర్ క్రైమ్ నేరాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, యువత, విద్యార్థులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చిన్న పిల్లలు, అమ్మాయిల విషయంలో ఏమైనా సమస్యలు, వేధింపులు ఉంటే సంకోచించకుండా తమకు తెలియజేయాలని, మహిళా పోలీసులు కూడా అందుబాటులో ఉన్నారని తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే స్థానిక ఎస్సై ముప్పు సురేష్‌కు లేదా డయల్ 100 కు అందించాలని కోరారు. ఈ కార్డన్ సెర్చ్‌లో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ బిజెపి జిల్లా అధ్యక్షులు - ఏడునూతల నిషిధర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మీడియా టుడే జూన్ 23**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనిపార్టీ కార్యాలయంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్ కోసం తన ప్రాణాలనే త్యాగం చేశారని, 370 ఆర్టికల్ విషయంలో అనేక ఉద్యమాలు చేసిలి ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ దో నిషాన్ నైచలేంగే అనే నినాదం తోటి కాశ్మీర్లో " ప్రవేశించారని దేశ సమైక్యత కోసం దేశ భవిష్యత్తు కోసం తన ప్రాణాలనుసైతంలెక్కచేయకుండా పోరాటం చేశాడని భారత ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ యొక్క ఆశయాలను కొనసాగించడానికి కాశ్మీర్ లోఉన్నటువంటి 370 ఆర్టికల్ నురద్దుచేశారని కాశ్మీర్ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే విధంగా మోడీ ప్రభుత్వ కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నె మొగిలి, పార్లమెంటరీ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్,పెండల రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుపోలసాని తిరుపతిరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, భూపాలపల్లి అర్బన్ అధ్యక్షులు కీస సంపత్,రూరల్ అధ్యక్షులు రాజు,బిజెపి సీనియర్ నాయకులు రామిరెడ్డి, బిఎంఎస్ నాయకులు శ్రీనివాస్, బిజెపి నాయకులు విప్లవ కుమార్,వంశి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విత్తన మేళను చేసుకోవాలి

**మర్కుకు జూన్ 23 మీడియా టుడే**



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచన మేరకు రైతు వేదికలో విత్తన మేళ అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి రాము రైతుల సమక్షంలో నిర్వహించారు. రైతంగానికి నాణ్యమైన విత్తనాలతో పాటు దేశంలో డిమాండ్ ఉన్న పంటలు పండియాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని మండల రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 31 వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వముచే బోనస్ పొందాలని సూచించారు. శాస్త్రీయంగా ఎంపిక చేసిన ఏడు రకాల బిపిటి 5204, తెలంగాణ సోనా, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కూనారం సన్నలు (1638), కే ఎన్ ఎం 7715, డబ్ల్యు జి ఎల్-44 అనే ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే రైతులు సాగు చేయాలని వీటికి ప్రభుత్వం పూర్తి బోనస్ అందిస్తుందని స్పష్టం చేశారు. అలాగే వీలు అయినంతవరకు రసాయనికి ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ గ్రామ సర్పంచ్ బుల్లె రాణి మల్లేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు భాను శ్రీ, విష్ణువర్ధన్, విత్తన డీలర్లు అజయ్ రెడ్డి, నాగరాజు రైతులుతదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ పోలీసు కార్యాలయాల వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**ప్రతి ఫిర్యాదుకు సత్వర స్పందన ఇవ్వాలి: అధికారులకు ఎస్పీ ఆదేశాలు**

**ప్రజా భద్రత, సైబర్ అవగాహనపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్ మీడియా టుడే జూన్ 23 :-**

వికారాబాద్ జిల్లా పోలీసు అధికారి శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారు వార్షిక తనిఖీలలో భాగంగా తాండూర్ రూరల్ సర్కిల్ కార్యాలయం మరియు తాండూర్ డీఎస్పీ కార్యాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించిన ఎస్పీ గారు, పరిశుభ్రత మరియు కార్యాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం సర్కిల్ మరియు సబ్-డివిజన్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పరిపాలనా పత్రాలు, స్టేషన్ వారీ రిజిస్టర్లు మరియు ఇతర అధికారిక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, దర్యాప్తులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.తనిఖీ సందర్భంగా సిబ్బంది టర్నౌట్‌ను పరిశీలించిన ఎస్పీ గారు, అధికారులు మరియు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నందుకు అభినందించారు. పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ మరియు ప్రజాసేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడానికి అమలు చేస్తున్న వి.పి.ఓ (విలేజ్ పోలీస్ ఆఫీసర్) వ్యవస్థను మరింత ప్రభావవంతంగా రూపొందించనున్నట్లు ఎస్పీ గారు తెలిపారు. గ్రామ స్థాయిలో సమాచార సేకరణ, నేర నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారం మరియు పోలీసు-ప్రజల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో వి.పి.ఓ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా "సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలు మరియు చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ గారు ఆదేశించారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, తాండూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.






## అంగనవాడి కేంద్రాలలో పిల్లల అభివృద్ధులు




**ములుగు మున్సిపాలిటీ జూన్ 23(మీడియా టుడే)**

పిల్లలలో అన్ని రకాల అభివృద్ధులు జరగాలంటే అంగనవాడి పాఠశాలకు పంపాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మంగళవారం బండారుపల్లి వన్ అంగనవాడి కేంద్రంలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ రెడినెస్ మేళా కార్యక్రమంలో తెలిపారు. శారీరక, మానసిక, భాషా, మేధో అభివృద్ధితో పాటు పూర్వ గణిత అభివృద్ధి కూడా పిల్లలలో జరుగుతుందని ములుగు ప్రాజెక్టు సీడీపీవో శిరీష తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం, పాలు, గుడ్లు కూడా అందజేస్తున్నామని చెప్పారు.పిల్లలకు అన్నివిధాల నైపుణ్యాలతో కూడిన విద్యతో పాటు ఆటపాటలు కూడా అంగనవాడిలో నేర్పిస్తున్నారని ములుగు మున్సిపల్ కౌన్సిలర్ సుష్మిత తెలిపారు. చిన్నారులలోని ప్రతిభను గుర్తించి వారి విద్యా వికాసాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో మల్లంపల్లి సెక్టార్ పరిధిలోని బండారుపల్లి అంగనవాడి కేంద్రంలో అభ్యాసన అంచనా కార్యక్రమాలను నిర్వహించారు.అంగనవాడి టీచర్ల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల శారీరక, భాషా, గణిత, మేధా సామర్థ్యాలను వివిధ పద్ధతుల ద్వారా అంచనా వేశారు.బాల్యంలోనే సరైన విద్య పునాది ఏర్పడితే భవిష్యత్తులో వారు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ప్రథమ్ మాస్టర్ ట్రైనర్ నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపల్ కాన్సిలర్స్ సుష్మిత, సాంబయ్య, నవీన్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, సీడీపీవో శిరీష, సూపర్వైజర్, టీచర్లు, ప్రథమ్ ప్రతినిధి నాగేశ్వర్ రావు, ఆశా వర్కర్లు, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిగ్రామపంచాయతీలో ప్రశాంత వాతావరణంలో మొహరం వేడుకలు జరుపుకోండి

**ఎస్సై - పోలీసు శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలి: ఎస్సై రామన్ గౌడ్**

**మీడియా టుడే న్యూస్ జూన్ 23, చిన్నంబావి:**

చిన్నంబావి మండల వ్యాప్తంగా నిర్వహించనున్న మొహరం వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని చిన్నంబావి ఎస్సై రామన్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, మండలంలోని అన్ని గ్రామాలు, పల్లెల్లో మొహరం ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి సామాజిక సామరస్యాన్ని కాపాడాలని, పోలీసు శాఖ జారీ చేసే సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.మొహరం ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్సై సూచించారు. చిన్నపాటి వివాదాలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అలాగే, మొహరం సందర్భంగా ఏర్పాటు చేసే అగ్నిగుండాల్లో పచ్చని చెట్లను నరికి వేయకుండా, ఎండిన చెట్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారం, సోదరభావంతో మొహరం వేడుకలను విజయవంతంగా నిర్వహించి, చిన్నంబావి మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఎస్సై రామన్ గౌడ్ పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎస్సై రామన్ గౌడ్

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా

**కొమ్మాల గ్రామంలో పారిశుధ్య వైఫల్యం**

**కుళ్లిన మృతదేహం, చీకటి రోడ్లు.. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**



**మీడియా టుడే,గీసుకొండ,జూన్ 23:**

గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిన దృశ్యం వెలుగులోకి వచ్చింది.గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక కుళ్లిపోయిన పిల్లి మృతదేహం గత ఐదు రోజులుగా తొలగించకుండా అలాగే ఉండటంతో ప్రాంతమంతా తీవ్ర దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఈ పరిస్థితి వల్ల స్థానికులు తీవ్ర అసహనానికి, ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో రోడ్లు అపరిశుభ్రంగా మారాయి. కుళ్లిన మృతదేహం కారణంగా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామం రాత్రివేళల్లో పూర్తిగా చీకటిలో మునిగిపోతోంది. దీంతో పాములు, తేళ్ల వంటి విష జీవుల భయం పెరిగి ప్రజలు రాత్రివేళ బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది.స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ గ్రామ పంచాయతీ కార్యదర్శి,సర్పంచ్ సహా సంబంధిత అధికారులు స్పందించలేదని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో పారిశుధ్య వైఫల్యం,మౌలిక వసతుల నిర్లక్ష్యం అధికార యంత్రాంగం నిర్లిప్తతను స్పష్టంగా చూపుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టి కుళ్లిన మృతదేహాన్ని తొలగించడంతో పాటు వీధి దీపాలు పునరుద్ధరించక పోతే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## చీకటాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో బాలసభ

**తొర్రూర్,జూన్ 23 (మీడియా టుడే)**




మండలంలోని చీకటయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ కృష్ణ స్వామి అధ్యక్షతన నిర్వహించిన బాలసభ లో గ్రామ ప్రథమ పౌరులు శ్రీ చిదురాల కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్య ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను వివరించారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నటువంటి విద్యార్థులను చదువుతోపాటు క్రమశిక్షణ, ఇతర కల్చరల్ ఆక్టివిటీస్ లో ముందంజలో ఉండే విధంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎల్లవేళలా కృషి చేయాలని అన్నారు.పాఠశాలకు ఏ అవసరాలు ఉన్న తాను ముందుండి సహకరిస్తానని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబాద్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల బస్సులను గ్రామాల్లోకి రాకుండా నిలిపివేసి గ్రామంలోని విద్యార్థులు అందర్నీ100 శాతం పూర్తిగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించిన కారణంగా మహబూబాద్ జిల్లాలోని మన చీకటాయపాలెం స్కూల్ అగ్రస్థానంలో ఉండడం, మరియు మన స్కూల్ కి తన సొంత ఖర్చులతో పెయింటింగ్ వేయించి స్కూల్ కి ఒక కొత్త రూపాన్ని తీసుకొచ్చిన ఘనత ఇది మన సర్పంచ్ గారి కృషి ఫలితంగా సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోడకండి సరస్వతి శేఖర్, వార్డు సభ్యులు ఏకాంబరం, కటకం రమేష్, పల్లె శిరీష యాకయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది. విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి

# బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారంలు అందజేయాలి

**బి.ఎల్.ఓ లు తన గుర్తింపు కార్డును వెంట తీసుకొని వెళ్ళాలి**

**ఒకే ఓటరుకు ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉంటే కఠిన చర్యలు తప్పవు**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టీకరణ**




**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి (జూన్ 23)**
జూన్ 25 నుండి ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించే ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుండి తహసీల్దార్లు, బి.ఎల్.ఓ లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియ జూన్ 25 నుంచి బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసే ప్రక్రియ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఒకవేళ ఏదైనా ఇంటికి తాళం ఉంటే బి.ఎల్. ఒ లు మరో రోజు వెళ్ళాలని, మళ్ళీ తాళం వేసి ఉంటే మూడోసారి సైతం వెళ్ళి ఫారాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు బి.ఎల్. ఒ లు మాత్రమే పంపిణీ చేయాలని ఎట్టిపరిస్థితుల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా పంపిణీ చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలా చేసినట్లు తమ దృష్టికీ వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్యుమరేషన్ ఫారం ల పంపిణీ ప్రక్రియ జులై 1 నాటికి పూర్తి చేసి పూరించిన ఫారాలను జాగ్రత్తగా పరిశీలించి తిరిగి తీసుకొని బి.ఎల్ ఒ యాప్ లో అప్లోడ్ చేసే ప్రక్రియ మొదలుపెట్టాల్సి ఉంటుందన్నారు. ఓటరు తన పేరులో ఏమైనా సవరణలు చేసుకోవాలనుకుంటే చేసుకోవచ్చని సూచించారు. మ్యాపింగ్ అయిన ఫారాలు, మ్యాపింగ్ కానీ ఫారాలు విడివిడిగా పెట్టుకోవాలని తెలిపారు. ప్రతి బి.ఎల్. ఒ సూపర్వైజరు కనీసం 10 శాతం సూపర్ చెక్ చేయాల్సి ఉంటుందని, ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధంగా రేషనలైజేషన్ చేయాలని సూచించారు.మండల, గ్రామ స్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బుధవారం అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టాలని సూచించారు.ఎస్.ఐ.ఆర్ జరుగునంత కాలం బి.ఎల్. ఒ లకు, సూపర్వైజర్లకు ఎట్టిపరిస్థితుల్లో గైర్హాజరు కానీ సెలవులు మంజూరు చేయబడవని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, డి.ఆర్. ఓ సూర్య ప్రకాష్, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్లు, బి.ఎల్. ఒ లు వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ - ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు దిశానిర్దేశం**

**విద్యార్థుల నమోదు పెంపుతో పాటు వర్షాకాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**డీఈఓ రేణుకాదేవితో కలిసి అదనపు కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మీడియా టుడే (జూన్ 23):**
జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం వృద్ధి, ఎఫ్ఎల్ఎన్ర్యాంకింగ్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

**నెల రోజుల్లో అడ్మిషన్లు పెంచాలి..**
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి, అక్కడ ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నెల రోజుల వ్యవధిలో విద్యార్థుల నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యా రంగంలో రాష్ట్ర స్థాయిలో మేడ్చల్ జిల్లాకు మెరుగైన స్థానం తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) ర్యాంకింగ్లో జిల్లా ముందంజలో నిలిచేలా విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు.

**వర్షాల నేపథ్యంలో అప్రమత్తత..**
ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల భద్రతకు ప్రధానోపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల భవనాలు, ప్రాంగణాల్లో అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తూ తమ పరిధిలోని ప్రతి పాఠశాలను నిరంతరం సందర్శించి ఉపాధ్యాయులకు తగిన మార్గదర్శనం చేయాలన్నారు. ప్రతి నెల అన్ని విద్యా అంశాలపై ప్రగతి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని, విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా చర్యలు

**హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక నిఘా అవసరం: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**. మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహణ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మీడియా టుడే (జూన్ 23):**
జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా నమోదు కాకుండా లక్ష్యంగా పెట్టుకుని వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతృ మరణాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ పీహెచ్సీ పరిధికి చెందిన అమీనా బేగం, శ్రీరంగవరం పీహెచ్సీ పరిధికి చెందిన సమీనా ఖాతూన్, కుత్బుల్లాపూర్ పీహెచ్సీ పరిధికి చెందిన ఆలమ్ జహాన్ కేసులను క్షుణ్ణంగా సమీక్షించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి ప్రతి కేసుకు సంబంధించిన పరిస్థితులు, వైద్యపరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,... గర్భిణీలకు సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు ప్రమాద సూచనలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిఫరల్ సేవలను మరింత బలోపేతం చేయాలని, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్వైజర్లు హైరిస్క్ గర్భిణీలను ప్రతిరోజూ ఫాలోఅప్ చేయాలని సూచించారు. వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధతో మాతా--శిశు సంరక్షణ సేవలు అందించాలని, 102 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి గర్భిణీకి ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. రక్తహీనత వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంతో పాటు పోషకాహారం, సాధారణ ప్రసవాలు, ఆరోగ్య శాఖ అందించే సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మాతా--శిశు సంరక్షణ సేవల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, జిల్లాలో మాతృ మరణాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ గీతా, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవిలత, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లావణ్య, డిప్యూటీ డెమో వసంత, డీఎస్వో యాదగిరి, పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ ప్రతిభ గాయత్రి, డాక్టర్ సౌశీల్య, డాక్టర్ అందుల్ వేణుగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోసపూరిత హామీలతో సతమతమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మహబూబ్నగర్ మీడియా టుడే ప్రతినిధి:**
రాష్ట్రంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పథకాలన్నింటిని ఎగ్గొడుతుందని మాజి ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో కోస్గి ముఖ్యనాయకులతో సర్ పై చర్చించి మాట్లాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు బంధు, రుణమాఫీని ఎగ్గొట్టాయని అన్నారు. వడ్ల కొనుగోలులో ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు.రేవంత్ రెడ్డి పిసిసిగా ఉన్నప్పుడు వడ్ల కొనుగోలులో రాద్ధాంతం చేసి ఇప్పుడు సియం కాగానే ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తానని చెప్పడం దుర్మార్గమని అన్నారు.గతంలో కెసిఆర్ సియం గా ఉన్నప్పుడు 40 రకాల సన్న బియ్యాన్ని రైతుల దగ్గర నేరుగా కొనేవారని అన్నారు. ఇప్పుడు సియం రేవంత్ రెడ్డి మాత్రం బోనస్ ఎగ్గోట్టే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి ఏడు రకాల సన్న బియ్యం నిబంధన పెట్టారని , ఇది సరికాదని



అన్నారు. కెసిఆర్ అధికారం లో ఉన్నప్పుడు రైతులు రాజులుగా ఉండే వారని ఇప్పుడు రైతులు దిక్కు లేని వారిగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను అన్న రకాలుగా మోసం చేసిన పార్టీ ఏదైమ ఉందంటే అది కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు.రైతు రుణ మాఫీని ఎగ్గొట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ, రైతుల వడ్లను కొనలేని అసమర్థ పార్టీ కాంగ్రెస్, రైతులను దిక్కు తోచకుండా చేసిన చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ, రైతుల రుణ మాఫీ ఎగ్గొట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.ఓటర్ల జాబితా సవరణ పట్ల బారాస శ్రేణులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని అన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిమ కోస్గి బారాస ఇంచార్జ్ వెంకట్ నర్సిములు పుట్టిన రోజు వేడుకలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మహిపాల్,ఉసేనప్ప గౌడ్, రాజశేఖర్ రెడ్డి, కోనేరు సాయప్ప, బెజ్జు నీలప్ప, వెంకటేష్, బుగ్గప్ప, గోపాల్, శాసం శ్రీనివాస్, మహేష్, శ్రీశైలం, శివ కుమార్, రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లవ్రాజు మృతి కేసు దర్యాప్తు పూర్తి

**సహజ మరణంగా తేల్చిన పోలీసులు**




**వరంగల్ జిల్లా బ్యూరో జూన్ 23,మీడియా టుడే.**
గీసుగొండ మండలం గోర్రెకుంట గ్రామానికి చెందిన ల్యాదెల్ల రాజు అలియాస్ లవ్రాజు మృతి కేసుపై పోలీసులు చేపట్టిన సమగ్ర దర్యాప్తు ముగిసింది. ప్రారంభంలో అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన ఈ కేసులో అన్ని కోణాల్లో విచారణ నిర్వహించిన అనంతరం, ఇది సడన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగా సంభవించిన సహజ మరణమని పోలీసులు నిర్ధారించారు.పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ పరకాల సి.హెచ్. సతీష్ బాబును ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి కేసును లోతుగా విచారించారు. సంఘటనా స్థల పరిశీలన, పోస్టుమార్టం, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణుల సేవలు, సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులు, వాట్సాప్ చాట్ల విశ్లేషణతో పాటు పలువురు సాక్షుల వాంగ్మూలాలను సేకరించారు.ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఫీూా) నివేదికలు, హిస్టోపాథాలజీ పరీక్షలు, కాకతీయ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ నిపుణుల తుది అభిప్రాయాల ప్రకారం మృతదేహంపై ఎలాంటి ప్రాణాంతక గాయాలు లేదా విషపదార్థాల ఆనవాళ్లు లభించలేదని తేలింది. శరీరంపై కనిపించిన కొన్ని గుర్తులు మరణానంతర మార్పులు, చీమల కాట్లు మరియు ముల్లుల వల్ల ఏర్పడినవేనని వైద్య నిపుణులు వెల్లడించారు.మృతుడి కుటుంబ సభ్యులు వ్యక్తం చేసిన అనుమానాలపైనా ప్రత్యేకంగా విచారణ జరిపిన పోలీసులు, హత్య లేదా ఇతర నేరపూరిత చర్యలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. అన్ని శాస్త్రీయ, వైద్య మరియు సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం లవ్రాజు సడన్ కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణించినట్లు నిర్ధారించి కేసును సహజ మరణంగా ముగించారు.ఈ దర్యాప్తు ద్వారా వాస్తవాలను వెలికితీసి ప్రజల్లో ఉన్న అనుమానాలకు తెరదించినట్లు పోలీసులు తెలిపారు.

# యువతమాదకద్రవ్యాలకు దూరంగాఉండాలి

**నేలకొండపల్లి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ బి.కోటేశ్వరరావు**



**నేలకొండపల్లి జూన్ 23 మీడియట్ టుడే ప్రతినిధి**
నేలకొండపల్లిమండల పరిధిలోని చెరువుమాదారంగ్రామంలో ని ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకుమారకద్రవ్యాలపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ .బికోటేశ్వరరావు మాట్లాడుతూ.విద్యార్థులు మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన చెప్పారు.విద్యార్థులు చదువుమీదనే దృష్టి పెట్టాలి తప్ప చెడు వ్యసనాలకులోనుకావద్దనిఆయన విద్యార్థులకుపిలుపునిచ్చారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే నీ జీవితంతో పాటు నీ కుటుంబం కూడా ప్రశాంతంగా ఉండలేదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఎస్ఐ ఎండి లతీఫ్. పోలీస్ కానిస్టేబుల్ రాజేష్. స్కూలు ప్రధానోపాధ్యాయుడు నరేందర్. పి ఈ టి ఉజ్వల. చెరువు మాదారం గ్రామపంచాయతీ కార్యదర్శి భాషా నాయక్. విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళ



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వలిగొండ,ప్రొద్దటూరు రైతువేదికలలో వ్యవసాయ శాఖ వలిగొండ వారి ఆధ్వర్యంలో జూన్ 23 నుండి 30 వరకు విత్తన మేళా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి తెలిపారు.విత్తన మేళాలో వరి,కంది మరియు వివిధ రకాల పంటల విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని కావున మండల పరిధిలోని రైతులు విత్తన మేళాను సందర్శించి వారికి అనువుగా ఉన్నటువంటి విత్తనాలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టవలసినదిగా సూచించడం జరిగింది.మరియు ప్రభుత్వం సూచించిన 8 సన్న వరి రకాలను మాత్రమే సాగుచేసి క్వింటాకు రూ 500/- బోనస్ పొందగలరని వ్యవసాయ శాఖ వారు సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వలన ఈ వానాకాలం వర్ష సూచన తక్కువ ఉన్నందున రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన పప్పు దినుసులు మరియు అపరాల సాగు చేపట్టవలసిందిగా సూచించడం జరిగింది.

# ఘనంగా 23వ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



**నిర్మల్: సారంగాపూర్, జూన్ 23 , మీడియా టుడే**
సారంగాపూర్ మండలంలోని కౌట్ల( బి )గ్రామంలో 23వ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంమంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మించి 23వ సంవత్సరాలు అయిందని తెలిపారు.ఉదయాన్నే పూజా కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం పల్లకి సేవ గ్రామ వీధులలో సాయిబాబా పల్లకిని ఊరేగింపు జరిపారు.మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక








**రాయికల్-మీడియా టుడే-జూన్ 23:**
రాయికల్ మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకోన్నారు. ఇందులో అధ్యక్షునిగా వాసం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా సుధవేని మురళి గౌడ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

# ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బానావత్ తిరుపతి

**రాయికల్-మీడియా టుడే-జూన్ 23:**



రాయికల్ మండలం దావనపల్లి గ్రామనికి చెందిన బానావత్ తిరుపతి నాయక్ ను బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నియమించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ...పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

# వార్షికోత్సవ జాతర ఆహ్వానం



**రాయికల్-మీడియా టుడే-జూన్ 23:**
రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, జ్ఞాన సరస్వతి మాత దేవాలయంలో ద్వాదశ (12) వార్షికోత్సవ జాతర సందర్భంగా మంగళవారం అభిషేకం, పుణ్య హవచనము, మంత్ర ఆరాధన హోమము ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్వామి వారి కళ్యాణ మహోత్సవం, తదుపరి పల్లకి సేవ.... గురువారం మహా అన్నప్రసాధన కార్యక్రమం, జాతర ఘనంగా నిర్వహించబడునని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.